




# ప్రజా న్యూస్ నెట్ వర్క్ దినపత్రిక

తెలంగాణ,ఆంధ్రప్రదేశ్,సంపుటి :01,సంచిక : 112,చీఫ్ ఎడిటర్ : వి.శివ కృష్ణ, వెల : 02,ఆదివారం, తేదీ : 23-08-2026


## కొత్త సుంకాలతో అమెరికా కెనడా మధ్య ముదిరిన వాణిజ్య ఉద్రిక్తత



అమెరికా కొత్తగా 50 శాతం సుంకాలు విధించేందుకు సిద్ధమైంది.

అమెరికా విధించే సుంకాలకు డాలర్‌కు డాలర్ చొప్పున సమాధానం ఇస్తామని కెనడా హెచ్చరించింది.

చివరి నిమిషంలో జరిగిన చర్చలు విఫలం కావడంతో.. కెనడియన్ వస్తువులపై అమెరికా కొత్తగా 50 శాతం సుంకాలు విధించేందుకు సిద్ధమైంది. దీనికి ప్రతిగా అమెరికా విధించే సుంకాలకు డాలర్‌కు డాలర్ చొప్పున సమాధానం ఇస్తామని కెనడా హెచ్చరించింది. తాజా పరిణామం ఇప్పటికే ఉద్రిక్తంగా ఉన్న ఇరు దేశాల సంబంధాలపై మరింత ఒత్తిడిని పెంచింది. కెనడా ప్రధానమంత్రి మార్క్ కార్నీ చర్చలను నిలిపివేసి.. వాషింగ్టన్‌లో ఉన్న తమ ప్రతినిధి బృందాన్ని వెనక్కి రావాలని ఆదేశించారు. అమెరికా చివరి నిమిషంలో తన ప్రతిపాదిత నిబంధనల్లో మార్పులు చేసిందని ఆయన ఆరోపించారు. మిగతా..2లో

## రూ.7,000 కోట్లతో కొత్త ఎల్‌పీజీ పైప్‌లైన్లు.. తెలంగాణకు ప్రయోజనం



రూ.7,000 కోట్లతో ఎల్‌పీజీ పైప్‌లైన్ విస్తరణకు కేంద్రం ఆమోదం

తెలంగాణలోని చర్లపల్లి నుంచి నాగ్‌పూర్ వరకు కీలక మార్గం

దేశవ్యాప్తంగా 1,800 కిలోమీటర్ల మేర కొత్త లైన్ల నిర్మాణం

ప్రాజెక్టును చేపట్టనున్న గెయిల్ ఇండియా లిమిటెడ్

తగ్గనున్న రవాణా ఖర్చులు, ప్రమాదాల ముప్పు

హైదరాబాద్: దేశంలో ఎల్‌పీజీ సరఫరా వ్యవస్థను మరింత పటిష్ఠం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. సుమారు రూ. 7,000 కోట్ల వ్యయంతో ఎల్‌పీజీ పైప్‌లైన్ నెట్‌వర్క్‌ను భారీగా విస్తరించేందుకు పెట్రోలియం, సహజ వాయువు నియంత్రణ మండలి (పీఎన్‌జీఆర్‌బీ) ఆమోదం తెలిపింది. మిగతా..2లో

## ప్రభుత్వ ఆసుపత్రుల పనితీరుపై మంత్రి దామోదర్ రాజనర్సింహ కీలక సమీక్ష



- తెలంగాణలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవలు, మౌలిక వసతులపై ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ కీలక సమీక్ష నిర్వహించారు.
- అన్ని జిల్లాల డీసీహెచ్‌ఎస్‌లతో సమావేశమైన మంత్రి..
- ఆసుపత్రుల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో చర్చించారు.

హైదరాబాద్, ఆగస్టు 22: ప్రభుత్వ ఆసుపత్రుల పనితీరుపై మంత్రి దామోదర్ రాజనర్సింహ కీలక సమీక్షించారు. తెలంగాణలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవలను మరింత మెరుగుపరచడం, ప్రజలకు నాణ్యమైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవడంపై ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ సమీక్ష నిర్వహించారు.

### జేడీ వాన్స్, జొహ్రాన్ మమ్దానీలతో భేటీకి రేవంత్ ప్లాన్?

# కేంద్రం అందుకే అనుమతి నిరాకరించిందా?

- రేవంత్ రెడ్డి అమెరికా టూర్‌కు కేంద్ర అనుమతి నిరాకరణ
- జేడీ వాన్స్, మమ్దానీలతో సమావేశానికి రేవంత్ ప్లాన్ చేసినట్లు సమాచారం
- ఆ విషయాన్ని విదేశాంగ శాఖకు వెల్లడించలేదని సమాచారం
- అందుకే అనుమతి నిరాకరించినట్లు ఎన్‌డీటీవీ కథనం



హైదరాబాద్: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రతిపాదిత అమెరికా పర్యటనకు కేంద్ర ప్రభుత్వం అనుమతి నిరాకరించిన విషయం తెలిసిందే. అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, న్యూయార్క్ మేయర్ జొహ్రాన్ మమ్దానీలతో భేటీలు కూడా ఆయన పర్యటనలో భాగంగా ఉండటమే ఇందుకు కారణంగా కేంద్ర ప్రభుత్వ వర్గాలు తెలిపినట్లు ఎన్డీటీవీ పేర్కొంది. అమెరికా, బ్రిటన్ పర్యటనలకు తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి కార్యాలయం విదేశాంగ మంత్రిత్వ శాఖ నుంచి అనుమతి కోరింది. బ్రిటన్ పర్యటనకు అంగీకరించిన కేంద్రం అమెరికా టూర్‌కు మాత్రం అనుమతి నిరాకరించింది. అమెరికా పర్యటనలో జేడీ వాన్స్, జొహ్రాన్ మమ్దానీలతో భేటీలను ప్రతిపాదించినప్పటికీ.. ఈ కార్యక్రమాలను విదేశాంగ శాఖతో చర్చించలేదని, రాజకీయ అనుమతి ప్రక్రియలో భాగంగా సమాచారం పంపలేదని కేంద్ర ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. విదేశీ పర్యటనలకు అనుమతి ఇచ్చే ముందు ముఖ్యమంత్రి వంటి ప్రజాప్రతినిధుల ప్రతిపాదిత కార్యక్రమాలను విదేశాంగ శాఖ పరిశీలిస్తుంది. పదవికి, పర్యటన ఉద్దేశానికి అనుగుణంగా కార్యక్రమాలు ఉన్నాయా? అన్నది పరిశీలించిన తర్వాతే అనుమతి ఇస్తుంది. ఈ అంశంపై శుక్రవారం విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ స్పందించారు. రేవంత్‌రెడ్డి బ్రిటన్ పర్యటనకు అనుమతి ఇచ్చామని, అమెరికా పర్యటనకు మాత్రం మిగతా..2లో

## రామగుండం ఎరువుల కర్మాగారం మూసివేతపై కేంద్రం జోక్యం చేసుకోవాలి



- రామగుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ (ఆర్‌ఎఫ్‌సీఎల్) షట్‌డౌన్‌పై తక్షణమే జోక్యం చేసుకోవాలని
- కేంద్ర ప్రభుత్వానికి తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు.

హైదరాబాద్, ఆగస్టు 22: రామగుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ (ఆర్‌ఎఫ్‌సీఎల్) షట్‌డౌన్‌పై తక్షణమే జోక్యం చేసుకోవాలని కేంద్ర ప్రభుత్వానికి తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వ రరావు విజ్ఞప్తి చేశారు. దీని వల్ల సుమారు 10 రోజుల పాటు యూరియా ఉత్పత్తికి అంత రాయం ఏర్పడు తుందన్నారు. ఖరీఫ్ సీజన్‌లో యూరియా డిమాండ్ అధికంగా ఉన్న వేళ ఈ షట్‌డౌన్ ఆందోళ నకరమని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం కేంద్ర ఆరోగ్య శాఖ మిగతా..2లో

## వందేమాతరంపై దేశవ్యాప్తంగా కార్యక్రమాలు'- కాంగ్రెస్ నిర్ణయాన్ని ఖండిస్తూ బీజేపీ తీర్మానం



- జాతీయ గేయం చరిత్ర, వారసత్వంపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పిస్తామని పార్టీ వెల్లడి
- వందేమాతరం రెండు చరణాలే పాడుతామంటూ కాంగ్రెస్ చేసిన ప్రకటనను ఖండిస్తూ మరో తీర్మానానికి పార్టీ ఆమోదం

ఢిల్లీ : వందేమాతరం విషయంలో కాంగ్రెస్ "బుజ్జగింపు రాజకీయాలకు" పాల్పడుతోందని బీజేపీ శనివారం ఆరోపించింది.

### అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి..

# డీఎంకే సంచలన నిర్ణయాలు..!

- డీఎంకే పార్టీ సంస్థాగత నిర్మాణంలో కీలక మార్పులు
- కొత్త నాయకత్వానికి అవకాశం కల్పించడమే ఈ సంస్కరణల ఉద్దేశం
- బ్రాంచ్ పార్టీ కార్యదర్శి పదవికి గరిష్ఠ వయోపరిమితి 45 ఏళ్లు
- మున్సిపల్, సిటీ, టౌన్ పంచాయతీ వార్డు కమిటీ కార్యదర్శులకు 50 ఏళ్ల పరిమితి
- కీలక పదవుల్లో ఎన్నికైన వారు గరిష్ఠంగా రెండు టర్ములు మాత్రమే



ఢిల్లీ : డీఎంకే అధ్యక్షుడు ఎంకే స్టాలిన్ పార్టీ సంస్థాగత నిర్మాణంలో కీలక మార్పులు చేపట్టారు. పార్టీకి కొత్త రక్తాన్ని తీసుకురావడమే లక్ష్యంగా పలు కీలక పదవులకు వయోపరిమితి విధించడంతో పాటు.. వరుసగా రెండు పర్యాయాలకు మించి ఆ పదవుల్లో కొనసాగకుండా కొత్త నిబంధనలు తీసుకొచ్చారు. చెన్నైలో జరిగిన డీఎంకే కార్యవర్గ సమావేశంలో ఈ మార్పులకు సంబంధించిన తీర్మానాలకు ఆమోదం లభించింది. ఈ సంస్కరణలు పార్టీ సంస్థాగత వ్యవస్థలో కొత్త నాయకత్వానికి అవకాశం కల్పిస్తాయని డీఎంకే వర్గాలు పేర్కొన్నాయి. అలాగే అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి నుంచి పార్టీ వర్గాల్లో

### వేగవంతమైన ఆర్థిక పురోగతికి పటిష్ఠమైన

# న్యాయ వ్యవస్థలే వెన్నెముక

- ఢిల్లీలో జరిగిన 11వ బ్రిక్స్ ప్లస్ లీగల్ ఫోరంలో పాల్గొన్న సీజేఐ జస్టిస్ సూర్యకాంత
- అక్కడ న్యాయనామిక్స్, న్యాయ సేతు అనే పదాలను పరిచయం చేసిన ప్రధాన న్యాయమూర్తి
- భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్



ఢిల్లీ : స్థిరమైన ఆర్థిక వృద్ధి కేవలం భౌగోళిక లేదా ముడి సహజ వనరులపై మాత్రమే కాకుండా సంస్థాగత స్థిరత్వం, విశ్వాసం, సామర్థ్యంపై ఎక్కువగా ఆధారపడి ఉంటుందని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ తెలిపారు. బ్రిక్స్ ప్లస్ దేశాలు మానవాళిలో 40శాతానికి పైగా, ప్రపంచ పీపీపీ ఉత్పత్తిలో దాదాపు 40శాతం వాటాను కలిగి ఉన్నాయని చెప్పారు. వేగవంతమైన మిగతా..2లో

### సమాజంలో సమూల మార్పులు

# విద్యతోనే సాధ్యం



- ఉత్తరాంధ్ర ఉపాధ్యాయుల క్లస్టర్ సమావేశంలో పాల్గొన్న మంత్రి లోకేశ్
- మారుతున్న కాలానికి అనుగుణంగా ఉపాధ్యాయులు తమ బోధనా పద్ధతులను మార్చుకోవాలని సూచన
- ప్రతీ ఉపాధ్యాయుడు ఏఐపై అవగాహన పెంచుకోవాలని వ్యాఖ్య
- ఉత్తరాంధ్ర ఉపాధ్యాయుల క్లస్టర్ సమావేశంలో పాల్గొన్న మంత్రి లోకేశ్

### త్వరలోనే అనకాపల్లి, విశాఖకు

# గోదావరి నీళ్లు తెస్తాం

- అనకాపల్లి జిల్లాలో స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో చంద్రబాబు
- అభివృద్ధి అంటే పరిశ్రమలు, పెట్టుబడులు, కంపెనీలే కాదు స్వచ్ఛమైన ప్రాంతాలన్న ముఖ్యమంత్రి
- స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో చంద్రబాబు
- స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో చంద్రబాబు



అమరావతి : విశాఖకు మించి అనకాపల్లికి పెట్టుబడులు వస్తున్నాయని సీఎం చంద్రబాబు అన్నారు. స్టీల్ సిటీ నిర్మాణం కాబోతుందని, భవిష్యత్తులో నాలెడ్జ్ ఎకానమీకి కేంద్రంగా అనకాపల్లి మారబో తుందన్నారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా అనకాపల్లి జిల్లా కె.కోటపాడు మండలం ఎ.కోడూరులో పర్యటించిన సీఎం ప్రజావేదికలో మాట్లాడారు. ప్రతి గ్రామం జీరో వేస్ట్ పంచాయతీగా తయారు కావాలన్నారు. గత ఐదేళ్ల వైఎస్సార్సీపీ పాలనలో మిగతా..2లో

## నోరు తెరిస్తే అబద్ధాలు.. అడుగు వేస్తే అరాచకం: జగన్ పై మంత్రి పార్థసారథి ఫైర్



- డీఎస్సీపై జగన్ అబద్ధాలు.. ఏపీపీఎస్సీ స్కాంను కప్పిపుచ్చేందుకేనని మంత్రి విమర్శలు
- వైసీపీ హయాంలో ప్లంబర్లు, కూలీలతో గ్రూప్-1 పేపర్లు దిద్దించారని ఆరోపణ
- ఏపీపీఎస్సీ స్కాంపై సిట్ నివేదికపై బహిరంగ చర్చకు రావాలని జగన్‌కు సవాల్
- అసెంబ్లీకి రాకుండా జగన్ పారిపోతున్నారని ఎద్దేవా
- యువతకు ఉద్యోగాలివ్వడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని స్పష్టీకరణ మిగతా..2లో

ప్రజా న్యూస్ నెట్ వర్క్ దినపత్రిక

ఆదివారం 23-08-2026

మొదటి పేజి తరువాయి

## జేడీ వాన్స్, జొహ్రాన్ మమ్దానీలతో భేటీకి రేవంత్ ప్లాన్? కేంద్రం అందుకే అనుమతి నిరాకరించిందా?

అనుమతి ఇవ్వలేదని తెలిపారు. ముఖ్యమంత్రులు, ఇతర ప్రముఖుల విదేశీ పర్యటనలు కొన్ని ప్రమాణాలకు తగినవిగా ఉండాలని స్పష్టం చేశారు. అమెరికా పర్యటన విషయంలో ఆ ప్రమాణాలు సరిపోలకపోవడంతో అనుమతి నిరాకరించినట్లు వెల్లడించారు. అమెరికాలో తెలుగు ప్రజల సంఖ్య భారీగా ఉండటంతో రేవంత్‌రెడ్డి పర్యటనకు ప్రాధాన్యం ఏర్పడింది. అమెరికాలోని భారతీయ అమెరికన్లలో తెలుగు సమాజం సుమారు 14 శాతం ఉంటుందని, 12 లక్షలకు పైగా తెలుగు ప్రజలు అక్కడ ఉన్నారని సమాచారం. అయితే ఈ వ్యవహారం తెలంగాణలో రాజకీయ వివాదానికి దారితీసింది. అమెరికా పర్యటనకు అనుమతి నిరాకరించి, బ్రిటన్ పర్యటనకు అనుమతి ఇవ్వడంపై ప్రశ్నలు తలెత్తాయి. అయితే కేంద్ర ప్రభుత్వ వర్గాలు మాత్రం ఈ నిర్ణయం రాజకీయ కక్షతో తీసుకున్నది కాదని, కేవలం సాంకేతిక అంశాల ఆధారంగానే అమెరికా పర్యటనకు అనుమతి నిరాకరించినట్లు చెబుతున్నాయి.

## రూ.7,000 కోట్లతో కొత్త ఎల్‌పీజీ పైప్‌లైన్లు.. తెలంగాణకు ప్రయోజనం

ఈ బృహత్తర ప్రాజెక్టు ద్వారా తెలంగాణ రాష్ట్రానికి గణనీయమైన లబ్ధి చేకూరనుంది. ప్రభుత్వ రంగ సంస్థ గెయిల్ (ఇండియా) లిమిటెడ్ ఆధ్వర్యంలో సుమారు 1,800 కిలోమీటర్ల మేర కొత్త పైప్‌లైన్లను నిర్మించనున్నారు. ఇందులో భాగంగా తెలంగాణలోని చర్లపల్లి నుంచి మహారాష్ట్రలోని నాగ్‌పూర్ వరకు 556 కిలోమీటర్ల పొడవైన పైప్‌లైన్‌ను ఏర్పాటు చేయనున్నారు. దీనితో పాటు ఉత్తరప్రదేశ్‌లోని ఝాన్సీ నుంచి ఉత్తరాఖండ్‌లోని సితార్‌గంజ్ వరకు (611 కి.మీ.), మహారాష్ట్రలోని శిక్రాపూర్ నుంచి కర్ణాటక, గోవాలోని హుబ్లీ వరకు (633 కి.మీ.) మరో రెండు ప్రధాన మార్గాలను కూడా నిర్మించనున్నారు. ఈ పైప్‌లైన్లు తెలంగాణ, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, కర్ణాటక, గోవా రాష్ట్రాల గుండా వెళతాయి. ఈ ప్రాజెక్టు పూర్తయితే దేశంలోని మొత్తం ఎల్‌పీజీ పైప్‌లైన్ నెట్‌వర్క్ ప్రస్తుతం ఉన్న 7,700 కిలోమీటర్ల నుంచి 9,500 కిలోమీటర్లకు విస్తరిస్తుంది. పైప్‌లైన్ల ద్వారా గ్యాస్ సరఫరాను పెంచడం వల్ల రవాణా ఖర్చులు తగ్గడమే కాకుండా, రహదారులపై ట్రాఫిక్ రద్దీ, ప్రమాదాల ముప్పు కూడా గణనీయంగా తగ్గుతాయని ప్రభుత్వం అంచనా వేస్తోంది.

## రామగుండం ఎరువుల కర్మాగారం మూసివేతపై కేంద్రం జోక్యం చేసుకోవాలి

మంత్రి జేపీ నడ్డాకు మంత్రి తుమ్మల లేఖ రాశారు. గత ఖరీఫ్ సీజన్‌లో112 రోజుల పాటు ఆర్ఎఫ్‌సీఎల్‌లో యూరియా ఉత్పత్తి నిలిపి వేశారని గుర్తు చేశారు. ఈ సంస్థ తరచూ షట్‌డౌన్ కారణంగా రాష్ట్రంలో యూరియా సరఫరాలో అంతరాయం ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎఫ్ఎఫ్ఎస్ ద్వారా రైతులకు యూరియా అందించడంలో ఆర్ఎఫ్‌సీఎల్ కీలకమని ఆ లేఖలో స్పష్టం చేశారు. ప్రస్తుతం షట్‌డౌన్‌ను త్వరగా ముగించి యూరియా ఉత్పత్తిని పునరుద్ధరించాలని ఈ సందర్భంగా కేంద్రాన్ని ఆయన కోరారు. ఆర్ఎఫ్‌సీఎల్ లోటును ఇతర దేశీయ ప్లాంట్లు, దిగుమతుల ద్వారా భర్తీ చేయాలని కేంద్రానికి ఆయన విన్నవించారు. రైతులకు ఇబ్బంది లేకుండా ముందస్తుగా తగినంత యూరియా నిల్వలు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. నేటి (ఆగస్టు 22) నుంచి రామగుండం ఎరువుల కర్మాగారాన్ని షట్‌డౌన్ చేసిన సంగతి తెలిసిందే.

## ప్రభుత్వ ఆసుపత్రుల పనితీరుపై మంత్రి దామోదర్ రాజనర్సింహ కీలక సమీక్ష

వెంగల్‌రావునగర్‌లోని ఔలో అన్ని జిల్లాల డీసీహెచ్‌ఎస్‌లతో మంత్రి సమావేశమయ్యారు. డైరెక్టరేట్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ పరిధిలోని ప్రభుత్వ ఆసుపత్రుల పనితీరుపై విస్తృతంగా చర్చించారు. ముఖ్యంగా కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ఏరియా ఆసుపత్రులు, జిల్లా ఆసుపత్రుల్లో అందుతున్న వైద్య సేవలు, రోగులకు ఎదురవుతున్న ఇబ్బందులు, సిబ్బంది పనితీరు, ఆసుపత్రుల్లో అందుబాటులో ఉన్న మౌలిక వసతులపై వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే ప్రతి రోగికీ మెరుగైన వైద్యం అందేలా వైద్య సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని మంత్రి సూచించినట్లు సమాచారం. అదేవిధంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో మౌలిక వసతులను బలోపేతం చేయడం, అవసరమైన వైద్య పరికరాలు, సిబ్బంది అందుబాటులో ఉండేలా చూడటం, వైద్య సేవల నాణ్యతను పెంచేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సమావేశంలో చర్చించారు. జిల్లాల వారీగా ఆసుపత్రుల పరిస్థితి, అవసరాలను గుర్తించి ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు. ప్రజలకు ప్రభుత్వ వైద్యంపై మరింత నమ్మకం కలిగేలా ఆసుపత్రుల్లో మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. సమావేశంలో ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి క్రిస్టినా జడ్ చొంగ్తుతో పాటు పలువురు ఉన్నతాధికారులు, అన్ని జిల్లాల డీసీహెచ్‌ఎస్‌లు పాల్గొన్నారు.

## అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి.. డీఎంకే సంచలన నిర్ణయాలు..!


కొత్త ఉత్సాహం నింపుతాయని భావిస్తున్నారు. కొత్త నిబంధనల ప్రకారం బ్రాంచ్ పార్టీ కార్యదర్శి పదవికి గరిష్ఠ వయోపరిమితిని 45 ఏళ్లుగా నిర్ణయించారు. మున్సిపల్, సిటీ, టౌన్ పంచాయతీ వార్డు కమిటీ కార్యదర్శుల వయసు 50 ఏళ్లకు మించకూడదు. టౌన్ పంచాయతీ పార్టీ కార్యదర్శులు, ఏరియా కమిటీ కార్యదర్శులు, సిటీ కమిటీ కార్యదర్శులకు గరిష్ఠ వయోపరిమితిని 60 ఏళ్లుగా నిర్ణయించారు. జిల్లా పార్టీ కార్యదర్శుల పదవికి అత్యధికంగా 70 ఏళ్ల వరకు వయోపరిమితి విధించారు. ఈ పదవుల్లో ఎన్నికైన వారు గరిష్ఠంగా రెండు టర్మ్ లు మాత్రమే కొనసాగేందుకు అవకాశం ఉంటుంది. దీంతో పార్టీ పదవుల్లో కొత్తవారికి అవకాశాలు పెరుగుతాయని భావిస్తున్నారు. స్థానిక సంస్థాగత విభాగాల నిర్మాణంలోనూ డీఎంకే మార్పులు చేసింది. గ్రేటర్ చెన్నై కార్పొరేషన్‌లో ఒక్కో ఏరియా కమిటీ పరిధిలో సగటున 40 వేల మంది ఓటర్లు ఉండేలా నిర్ణయించారు. ఇతర మున్సిపల్ కార్పొరేషన్లలో ఈ సంఖ్యను 30 వేలుగా నిర్ణయించారు. సిటీ కమిటీల పరిధిలో కూడా సగటున 40 వేల మంది ఓటర్లు ఉండేలా తీర్మానం చేశారు. ఈ మార్పులను డీఎంకే ఎంపీ పి. విల్సన్ స్వాగతించారు. ఇవి పార్టీ సంస్థాగత వ్యవస్థలో మంచి నిర్మాణాత్మక సంస్కరణలని, అందరికీ మేలు చేసే నిర్ణయాలని ఆయన పేర్కొన్నారు.

## కొత్త సుంకాలతో అమెరికా కెనడా మధ్య ముదిరిన వాణిజ్య ఉద్రిక్తత

కొత్త నిబంధనలు అన్యాయంగా, ఆర్థికపరంగా అసంబద్ధంగా ఉన్నాయని.. ఇలాంటి పరిస్థితుల్లో ఏదైనా ఒప్పందం విశ్వసనీయతపై ప్రశ్నలు తలెత్తుతాయని కార్నీ పేర్కొన్నారు. సుమారు 28 బిలియన్ డాలర్ల విలువైన కెనడియన్ వస్తువులపై 50 శాతం సుంకాలు విధించనున్నట్లు అమెరికా ప్రకటించింది. కెనడియన్ కార్మికులు, వ్యాపారాల ప్రయోజనాలను కాపాడేందుకు తమ ప్రభుత్వం కూడా సమాన స్థాయిలో ప్రతీకార సుంకాలు విధిస్తుందని కార్నీ స్పష్టం చేశారు. అయితే చర్చలు విఫలం కావడానికి కెనడానే కారణమని అమెరికా వాణిజ్య ప్రతినిధి కార్యాలయం ఆరోపించింది. వారంలో ప్రారంభంలో అంగీకరించిన నిబంధనల ప్రకారం ఒప్పందాన్ని ఖరారు చేసేందుకు ఒట్టావా నిరాకరించిందని పేర్కొంది. అమెరికా మార్కెట్‌కు ఎగుమతి చేసే ప్రధాన దేశాలకు అందించే అత్యుత్తమ వాణిజ్య ప్రాధాన్యతను కెనడాకు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నప్పటికీ.. కెనడా కొత్త డిమాండ్లు చేయడం, గతంలో చేసిన కొన్ని కట్టుబాట్ల నుంచి వెనక్కి తగ్గడం చర్చలపై ప్రభావం చూపాయని అమెరికా తెలిపింది. అమెరికా ప్రతిపాదించిన ప్యాకేజీలో ఉక్కు, అల్యూమినియం, ఆటోమొబైల్స్, కలపపై సుంకాలను గణనీయంగా తగ్గించే అంశాలు ఉన్నాయని అమెరికా వాణిజ్య ప్రతినిధి కార్యాలయం వెల్లడించింది. ఎగుమతి నియంత్రణలు, ట్రాన్స్‌షిప్‌మెంట్, డిజిటల్ వాణిజ్యం, కీలక ఖనిజాలు, బలవంతపు కార్మికులతో తయారైన వస్తువుల దిగుమతులపై ఇరు దేశాల మధ్య సహకారం కూడా ప్రతిపాదనలో ఉన్నట్లు తెలిపింది. అదే విధంగా ఏరోస్పేస్ రంగంలో సరఫరా గొలుసు సమన్వయం, యునైటెడ్ స్టేట్స్-మెక్సికో-కెనడా ఒప్పందం (యూఎస్ఎంసీఏ)పై అధికారిక చర్చలకు సంబంధించిన ప్రకటన కూడా ఈ ప్యాకేజీలో భాగంగా ఉండేదని అమెరికా పేర్కొంది. అమెరికాతో భాగస్వామ్యం చేసుకునే అవకాశాన్ని కెనడా కోల్పోయిందని అమెరికా వాణిజ్య ప్రతినిధి విమర్శించారు. మరోవైపు కెనడా ప్రధానమంత్రి కార్నీ.. తమ దేశం చాలా కెనడియన్ వ్యాపారాలకు సుంకాల రహిత అమెరికా మార్కెట్ ప్రవేశం, ద్వైపాక్షిక వాణిజ్యంలో స్థిరత్వం, వ్యూహాత్మక పరిశ్రమలపై సుంకాల తగ్గింపును కోరిందని తెలిపారు. అదే సమయంలో కెనడా తన ఆర్థిక స్వాతంత్ర్యం, విధానపరమైన సౌలభ్యాన్ని కొనసాగిస్తూ చిన్న, మధ్య తరహా వ్యాపారాలను రక్షించుకోవాలని భావించిందని చెప్పారు. అమెరికాతో గతంలో ఉన్న సంబంధాలు ఇకపై యథాతథంగా ఉండవని కెనడా గుర్తించిందని కార్నీ అన్నారు. ఏదైనా గడువులోపు ఒప్పందం కుదుర్చుకోవడం కంటే.. కెనడియన్ల ప్రయోజనాలను కాపాడే ఉత్తమ ఒప్పందాన్ని సాధించడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో కెనడియన్ కార్మికులు, వ్యాపారాలకు అదనపు ఆర్థిక సహాయాన్ని ప్రకటిస్తామని తెలిపారు. గత 18 నెలల్లో అందించిన దాదాపు 25 బిలియన్ డాలర్ల మద్దతుకు ఇది అదనంగా ఉంటుందని చెప్పారు. తాజా సుంకాలపై అమెరికాలోనూ వ్యతిరేకత వ్యక్తమవుతోంది. వెర్మాంట్‌కు చెందిన డెమొక్రటిక్ సెనేటర్, సెనేట్ ఫైనాన్స్ కమిటీ సభ్యుడు పీటర్ వెల్చ్.. కెనడియన్ వస్తువులపై కొత్తగా విధించనున్న 50 శాతం సుంకాలను ఉపసంహరించుకోవాలని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను కోరారు. ఈ సుంకాలు అమెరికా వ్యాపారాలు, రైతులు, కుటుంబాలపై ప్రతికూల ప్రభావం చూపుతాయని ఆయన అన్నారు. అమెరికా-కెనడా మధ్య వాణిజ్య విధానంపై కాంగ్రెస్ పాత్రను పెంచే ప్రతిపాదనలకు కూడా వెల్చ్ మద్దతు ఇస్తున్నారు. కెనడాపై విధించే సుంకాల నుంచి అమెరికా యాజమాన్యంలోని

## త్వరలోనే అనకాపల్లి, విశాఖకు గోదావరి నీళ్లు తెస్తాం

మొదటి పేజి తరువాయి



రాష్ట్రమంతా చెత్తమయం చేశారని ప్రస్తుతం ఆ చెత్తను తొలగించే పనులు ఊపందుకున్నాయన్నారు. స్వచ్ఛత మనందరి బాధ్యత: చెత్త నుంచి కంపోస్ట్, కరెంట్, గ్యాస్ ఉత్పత్తి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతి గ్రామానికి స్వచ్ఛ రథాలను పంపుతున్నామన్నారు. ఇంట్లోని చెత్త ఇస్తే బదులుగా మరొకటి ఇస్తారన్నారు. అభివృద్ధి అంటే పరిశ్రమలు, పెట్టుబడులు, కంపెనీలే కాదని స్వచ్ఛమైన ప్రాంతాలని సీఎం అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ మేరకు ప్రతి నెలా మూడో శనివారం స్వచ్ఛత, పరిశుభ్రత కోసం ఆలోచించాలని సూచించారు. స్వచ్ఛత కోసం ముందుకొస్తున్న ప్రతిఒక్కరినీ అభినందిస్తున్నామన్నారు. మన ఊరు - మన బాధ్యత సంకల్పం అందరూ తీసుకోవాలన్నారు. మన ఇల్లు, వీధి, కార్యాలయం, బహిరంగ ప్రదేశాలు అన్నీ పరిశుభ్రంగా ఉండాలని తెలిపారు. ఆరోగ్యకర జీవనానికి స్వచ్ఛత మరింత అవసరం సీఎం చంద్రబాబు అన్నారు. అనకాపల్లికి గోదావరి నీళ్లు: త్వరలోనే అనకాపల్లి, విశాఖకు గోదావరి నీళ్లు తెస్తామన్నారు. అనకాపల్లి జిల్లాలోని ప్రతి చెరువు, రిజర్వాయర్ నింపే బాధ్యత తమదని, సెప్టెంబర్ తొలి వారంలోనే అనకాపల్లికి నీళ్లు తెచ్చి చూపిస్తామని స్పష్టం చేశారు. క్వాంటం కంప్యూటర్ మన దేశానికి వస్తోందని సీఎం చంద్రబాబు వివరించారు. అమరావతి రావడం గర్వంగా భావిస్తున్నామన్నారు. ఇంటిపై సోలార్ ప్యానెల్ పెట్టుకుంటే ఒక్క రూపాయి ఖర్చు ఉండదని సూచించారు. ఆడబిడ్డల కోసం 3 గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నారు. రాబోయే రోజుల్లో 3 గ్యాస్ సిలిండర్ల డబ్బులు 4 నెలలకోసారి జమ చేస్తామన్నారు. ఇండక్షన్ స్టవ్‌లు పెట్టుకుంటే గ్యాస్‌తో కూడా అంత పని ఉండదని వివరించారు. 2047కు మోదీ నాయకత్వంలో దేశం అగ్రదేశంగా వికసిత్ భారత్ వెలుగొందుతుందన్నారు. 2047కు తలసరి ఆదాయం రూ.50 లక్షల వరకు పెరిగే అవకాశం ఉందని సీఎం చంద్రబాబు వివరించారు. 'డేటా సెంటర్ వస్తే లక్షల మందికి మంచి ఉద్యోగాలు వస్తాయి. ఆదాయం కూడా ఆకాశమే హద్దుగా ఉండబోతుంది. మంచి పనులు చేస్తుంటే అడ్డుకోవడానికి కొంతమంది ప్రయత్నిస్తున్నారు. గూగుల్ డేటా సెంటర్ కోసం సుందరమైన విశాఖకు వచ్చారని వేరే రాష్ట్రాలు ఆశ్చర్యపోతే ఇక్కడుండే వాళ్లు కొద్దిమంది జెండాలు పట్టుకుంటారన్నారు. ఇంతవరకూ డేటా సెంటర్ ప్రారంభం కాలేదు అప్పుడే నీళ్లు ఇంకిపోయాయంటారు. తాగడానికి నీళ్లు లేవంటూ దుష్ప్రచారం ప్రారంభించారు.'

## సమాజంలో సమూల మార్పులు విద్యతోనే సాధ్యం

మొదటి పేజి తరువాయి

అమరావతి : సమాజంలో మనం కోరుకున్న సమూల మార్పులు ఒక్క విద్యతోనే సాధ్యమవుతాయని విద్యాశాఖ మంత్రి లోకేశ్ స్పష్టం చేశారు. అందుకే తాను కీలకమైన విద్యాశాఖ బాధ్యతలు స్వీకరించానని చెప్పారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ఉపాధ్యాయులు తమ బోధనా పద్ధతులను మార్చుకోవాలన్నారు. విజయనగరం జిల్లా దాసన్నపేటలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఉత్తరాంధ్ర ఉపాధ్యాయుల క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యావ్యవస్థను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న కీలక నిర్ణయాలను లోకేశ్ వివరించారు. ప్రతీ ఉపాధ్యాయుడు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పరిజ్ఞానంపై అవగాహన పెంచుకోవాలన్నారు. తాను కూడా విద్యాశాఖ సమర్థ నిర్వహణకు ఏఐపై పూర్తిస్థాయిలో అవగాహన పెంచుకుంటున్నట్లు తెలిపారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా 10,000 పాఠశాలల్లో 'వన్ క్లాస్ - వన్ టీచర్' విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చామని వెల్లడించారు. 'ప్రభుత్వ పాఠశాలల్లో అధికంగా ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులే చదువుకుంటారు. వారిపై ఉపాధ్యాయులు మరింత ఆప్యాయత, శ్రద్ధ చూపాలి. చదువులో వెనుకబడిన పిల్లలను ప్రోత్సహించి ముందుకు నడిపించడమే ప్రభుత్వ ముఖ్య ఉద్దేశం. నేటి సమాజంలో విద్యార్థుల్లో పెరుగుతున్న చెడు వ్యసనాలను కట్టడి చేయడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలి. అదేవిధంగా ఈ సమస్య పరిష్కారానికి 'ఈగల్ క్లబ్' కీలక పాత్ర పోషిస్తుంది. ఇటీవల విశాఖలో ఓ విద్యార్థి మృతిచెందడం ఎంతో బాధాకరమని' లోకేశ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆన్‌లైన్ ద్వారా పలువురు ఉపాధ్యాయులతో లోకేశ్ నేరుగా మాట్లాడారు. బోధనలో వారు అనుసరిస్తున్న ఉత్తమ పద్ధతులను అడిగి తెలుసుకున్నారు. అంతేకాక వారి సమస్యలు, సూచనలను స్వీకరించారు. విద్యావ్యవస్థ మెరుగుదల కోసం ప్రతి నెలా ఈ క్లస్టర్ సమావేశంలో తాను స్వయంగా పాల్గొంటానని హామీ ఇచ్చారు. లోపాలను సరి చేసుకుంటూ ముందుకు సాగుతున్నామని ఆయన చెప్పారు. అంతకుముందు, విజయనగరం వై జంక్షన్ వద్దకు చేరుకున్న లోకేశ్ కు మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు మరియు పార్టీ శ్రేణులు ఘనస్వాగతం పలికారు. డప్పుల దరువులతో,




వివిధ రకాల జానపద కళారూపాలతో ఆయనకు స్వాగతం పలికారు. లోకేశ్ ను చూసేందుకు విజయనగరానికి చెందిన మోహన్ రావు అనే ఓ టీడీపీ కార్యకర్త సైకిల్ పై వచ్చాడు. ఈ సందర్భంగా ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు. గర్ల్స్ స్కూల్ వద్ద లోకేశ్ తో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఫొటోలు దిగారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ముచ్చటించిన ఆయన ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆశీర్వదించారు.

## నోరు తెరిస్తే అబద్ధాలు.. అడుగు వేస్తే అరాచకం: జగన్ పై మంత్రి పార్థసారథి ఫైర్

మొదటి పేజి తరువాయి

అమరావతి : వైసీపీ అధ్యక్షుడు జగన్ నోరు తెరిస్తే అబద్ధాలు, అడుగు వేస్తే అరాచకం తప్ప మరొకటి ఉండదని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఏపీపీఎస్సీని భ్రష్టుపట్టించిన ఘోరాలను కప్పిపుచ్చుకోవడానికే, నేడు అత్యంత పారదర్శకంగా నిర్వహిస్తున్న మెగా డీఎస్సీపై జగన్, ఆయన పార్టీ నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. శనివారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వంలో జరిగిన ఏపీపీఎస్సీ గ్రూప్-1 కుంభకోణంపై హైకోర్టు నియమించిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) సమర్పించిన నివేదికపై బహిరంగ చర్చకు వైసీపీ నేతలు సిద్ధమా అని మంత్రి సవాల్ విసిరారు. "నాడు గొడ్డలిపోటును గుండెపోటుగా చిత్రీకరించినట్లే, నేడు ఏపీపీఎస్సీ స్కామ్‌ను కప్పిపుచ్చుకోవడానికి మెగా డీఎస్సీపై బురదజల్లడం జగన్ దిగజారుడుతనానికి నిదర్శనం. కూటమి ప్రభుత్వం నిర్వహిస్తున్న డీఎస్సీపై వైసీపీ నేతలు 300 కేసులు వేయగా, వాటి వెనుక కుట్ర



ఉందని న్యాయస్థానమే అభిప్రాయపడింది" అని పార్థసారథి గుర్తుచేశారు. వైసీపీ హయాంలో నిబంధనలకు విరుద్ధంగా గ్రూప్-1 పరీక్షా పత్రాలను స్ట్రాంగ్ రూమ్‌లో కాకుండా, ప్రైవేట్ రిసార్టుకు తరలించి తమకు అనుకూలమైన వారితో మూల్యాంకనం చేయించారని మంత్రి ఆరోపించారు. "ప్లంబర్లు, కార్పెంటర్లు, రోజువారీ కూలీలు, పరీక్ష రాసిన వారి కుటుంబ సభ్యులతోనే పేపర్లు దిద్దించినట్లు సిట్ నివేదికలోనే బట్టబయలైంది. జవాబు పత్రాల్లో విచ్చలవిడిగా వైట్నర్ వాడటం, డూప్లికేట్ ఓఎంఆర్ షీట్లు సృష్టించడం ద్వారా అర్హులైన పేద విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేశారు" అని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎఫ్ఎస్ఎల్ ఫోరెన్సిక్ నివేదిక ప్రకారం ఎంపికైన 165 మంది అభ్యర్థుల్లో 95 శాతం మంది పేపర్లలో తీవ్ర అవకతవకలు జరిగాయని, 89 పత్రాల్లో ఎగ్జామినర్ సంతకాలు కూడా సరిపోలలేదని ఆయన వివరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి చంద్రబాబు తొలి సంతకంతోనే 16,347 ఉద్యోగాలతో మెగా డీఎస్సీకి శ్రీకారం చుట్టారని పార్థసారథి తెలిపారు. పెట్టుబడులు ఆకర్షించి ప్రైవేట్ రంగంలో లక్షలాది ఉద్యోగాలు సృష్టిస్తూ, ఏటా పారదర్శకంగా జాబ్ క్యాలెండర్ అమలు చేసేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఐదేళ్లలో చేసిన పాపాలు ఎక్కడ బయటపడతాయోనన్న భయంతోనే 11 మంది ఎమ్మెల్యేలున్నా జగన్ అసెంబ్లీకి రాకుండా పారిపోతున్నారని ఎద్దేవా చేశారు. నాడు ఒక్కరైనా లోక్ సత్తా జయప్రకాశ్ నారాయణ, బీజేపీ కిషన్ రెడ్డి అసెంబ్లీలో ఒంటరి పోరాటం చేశారని గుర్తుచేశారు. చంద్రబాబు నాయకత్వంలో యువత భవిష్యత్తు, రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని ఆయన పునరుద్ఘాటించారు.

## వేగవంతమైన ఆర్థిక పురోగతికి పటిష్ఠమైన న్యాయ వ్యవస్థలే వెన్నెముక

మొదటి పేజి తరువాయి

ఆర్థిక పురోగతికి పటిష్ఠమైన న్యాయ వ్యవస్థలే వెన్నెముక అని పేర్కొన్నారు. ఈ క్రమంలో చట్టబద్ధమైన పాలనకు సంబంధించిన 'న్యాయనామిక్స్', 'న్యాయసేతు' అనే పదాలను పరిచయం చేశారు. సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ శనివారం ఢిల్లీలో జరిగిన 11వ బ్రిక్స్ ప్లస్ లీగల్ ఫోరంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో 'న్యాయ సేతు' (న్యాయ వారధి), 'న్యాయఆర్థిక శాస్త్రం' (న్యాయనామిక్స్) అనే కాన్సెప్ట్‌లను పరిచయం చేశారు. బ్రిక్స్ ప్లస్ దేశాలలో చట్టపరమైన, ఆర్థిక శక్తిని ఏకీకృతం చేసేందుకు 'న్యాయనామిక్స్', 'న్యాయ సేతు' దార్శనికత గురించి వివరించారు. 'బహుధ్రువ ప్రపంచంలో చట్టబద్ధ పాలన' అనే అంశంపై జరిగిన ప్రారంభ ప్లీనరీలో సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ ఈ మేరకు వ్యాఖ్యానించారు.

న్యాయసేతు అనేది ఒక వారధి : సీజేఐ జస్టిస్ సూర్యకాంత్

"చట్టబద్ధమైన పాలన గురించి నేను ఒక పదాన్ని ఉదహరిస్తున్నాను. అదే న్యాయనమిక్స్. మరింత సరళంగా చెప్పాలంటే న్యాయ ఆర్థిక శాస్త్రం. ఈ న్యాయనామిక్స్ బ్రిక్స్ ప్లస్ దేశాలన్నింటికీ వర్తిస్తుంది. కేసులను డిజిటలైజ్ చేయడంలో భారతదేశానికి ఉన్న అనుభవాన్ని ఆధారంగా చేసుకుని, న్యాయశాస్త్రానికి సంబంధించిన ఒక ఉమ్మడి భాండాగారాన్ని ఏర్పాటు చేయాలి. తద్వారా బ్రిక్స్ ప్లస్ దేశాల అధికార పరిధిలో వెలువడిన తీర్పు, అదే విధమైన చట్టపరమైన ప్రశ్నలతో వ్యవహరించే ఇతర ప్రాంతాలలోని న్యాయస్థానాలకు మార్గదర్శకంగా ఉపయోగపడుతుంది. తద్వారా ఢిల్లీ, బ్రసీలియాలో రాసిన తీర్పు అదే ప్రశ్నను ఎదుర్కొంటున్న మరోచోట ఉన్న ధర్మాసనానికి తెలియజేయడానికి సంవత్సరాల తరబడి వేచి ఉండాల్సిన అవసరం లేదు. 'న్యాయ సేతు' అనేది 11 న్యాయ సంప్రదాయాలను అనుసంధానించే ఒక వారధి."

**- సీజేఐ జస్టిస్ సూర్యకాంత్**

**'బ్రిక్స్ పరస్పర సహకారం కోసం మరింత విస్తృతమైన వేదికగా ఎదిగింది'**

బ్రిక్స్ దేశాల మధ్య బలమైన న్యాయ సహకారం అవసరాన్ని బార్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఉపాధ్యక్షుడు ఎస్.ఎస్. నాగానంద్ కూడా నొక్కి చెప్పారు. బ్రిక్స్ ఏర్పడినప్పుడు దాని ప్రధాన దృష్టి సభ్య దేశాల మధ్య ఆర్థిక, ద్రవ్య సహకారాన్ని బలోపేతం చేయడంపైనే ఉందని పేర్కొన్నారు. సంవత్సరాలుగా బ్రిక్స్ పరస్పర సహకారం, భాగస్వామ్యం కోసం మరింత విస్తృతమైన వేదికగా ఎదిగిందని గుర్తు చేసుకున్నారు. దీంతో ఆర్థిక సంబంధాలతో పాటు చట్టపరమైన సంబంధాలు కూడా అనివార్యంగా బలపడతాయని తెలిపారు. "బ్రిక్స్ న్యాయ వేదికను స్థాపించడం, అభివృద్ధి చేయడం చాలా అవసరం. ఇలా చేస్తే సమస్యలను సమష్టిగా పరిశీలించడానికి, ఒకరి న్యాయ వ్యవస్థలను మరొకరు అర్థం చేసుకోవడానికి, ఒకరి అనుభవాల నుంచి మరొకరు నేర్చుకోవడానికి, అలాగే మన దేశాల మధ్య ఉన్న వివాదాలకు పరిష్కారాన్ని ఎలా సరళంగా, మరింత ప్రభావవంతంగా కనుక్కోవచ్చో అన్వేషించడానికి ఒక అద్భుతమైన అవకాశం లభిస్తుంది. ఈ మారుతున్న అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఢిల్లీలో ఒక బ్రిక్స్ మధ్యవర్తిత్వ కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి బార్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా చొరవ తీసుకుంది."

**- ఎస్.ఎస్. నాగానంద్**

**భారత్ అధ్యక్షతన బ్రిక్స్ సదస్సు**

2012, 2016, 2021లలో భారత్ బ్రిక్స్ సదస్సుకు అధ్యక్షత వహించింది. 2026లో నాలుగోసారి ఈ శిఖరాగ్ర సదస్సుకు అధ్యక్షత వహించనుంది. ఈ నేపథ్యంలో ప్రముఖ న్యాయ ప్రముఖుల నుంచి ఈ వ్యాఖ్యలు వెలువడ్డాయి. 'స్థితిస్థాపకత, ఆవిష్కరణ, సహకారం, సుస్థిరత కోసం నిర్మాణం' అనే ఇతివృత్తంతో ఇండియా బ్రిక్స్ సదస్సుకు అధ్యక్షత వహించనుంది. కాగా, బ్రిక్స్ కూటమిలో 2024లో ఇరాన్‌తోపాటు ఈజిప్టు, ఇథియోపియా, యూఏఈ దేశాలు చేరాయి.

## వందేమాతరంపై దేశవ్యాప్తంగా కార్యక్రమాలు'- కాంగ్రెస్ నిర్ణయాన్ని ఖండిస్తూ బీజేపీ తీర్మానం

మొదటి పేజి తరువాయి

రాజ్యాంగం, పార్లమెంట్ చేసిన చట్టాల కంటే ఏ పార్టీ లేదా వ్యక్తి గొప్పవారు కాదని స్పష్టం చేసింది. వందేమాతరం గేయంలోని కేవలం రెండు చరణాలను మాత్రమే పాడాలన్న కాంగ్రెస్ నిర్ణయాన్ని తీవ్రంగా ఖండిస్తూ బీజేపీ ఓ తీర్మానాన్ని ఆమోదించింది. రాజకీయ ప్రయోజనాల కోసం లేదా బుజ్జగింపుల కోసం జాతీయ గేయం గౌరవం విషయంలో ఎలాంటి రాజీని అంగీకరించబోమని స్పష్టం చేసింది. ఢిల్లీలో బీజేపీ అధ్యక్షుడు నితిన్ నబిన్ అధ్యక్షతన జరిగిన పార్టీ నూతన పదాధికారుల సమావేశంలో ఈ మేరకు తీర్మానం ఆమోదించారు. వందేమాతరం ఘనమైన వారసత్వాన్ని దేశం నలుమూలలా వ్యాప్తి చేయడానికి ఒక భారీ ప్రచారాన్ని ప్రారంభిస్తామని బీజేపీ పేర్కొంది. ఈ తీర్మానానికి సంబంధించిన వివరాలను నితిన్ నబిన్ ఎక్స్ వేదికగా పంచుకున్నారు. వందేమాతరాన్ని "స్వచ్ఛమైన జాతీయ భావానికి, సామ్రాజ్యవాద వ్యతిరేక నినాదంగా అభివర్ణించిన మహాత్మా గాంధీ ప్రకటనను పెద్దఎత్తున ప్రజల్లోకి తీసుకువెళ్తామని ఆయన పేర్కొన్నారు. ఆరు చరణాలతో కూడిన సంపూర్ణ జాతీయ గేయాన్ని, వందేమాతరంతో ముడిపడిన దేశ స్వాతంత్ర్య పోరాట జ్ఞాపకాలను యువత అర్థం చేసుకునేలా అవగాహన కార్యక్రమాలు



చేపడతామని నబీన్ వివరించారు. "2026 ఆగస్టు 22న వందేమాతరం పట్ల గౌరవం, దాని చారిత్రక వారసత్వ పరిరక్షణకు సంబంధించి ఒక ముఖ్యమైన తీర్మానాన్ని భారతీయ జనతా పార్టీ ఆమోదించింది. కాంగ్రెస్ కార్యక్రమాల్లో వందేమాతరం గీతాన్ని మొదటి రెండు చరణాలకే పరిమితం చేస్తూ 1937లో తీసుకున్న నిర్ణయాన్ని పునరుద్ఘాటిస్తూ, కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ఆగస్టు 19, 2026న తీసుకున్న నిర్ణయాన్ని బీజేపీ తీవ్రంగా ఖండిస్తోంది. రాజకీయ ప్రయోజనాలు లేదా బుజ్జగింపుల కోసం వందేమాతరం గౌరవం, వారసత్వం విషయంలో ఎటువంటి రాజీని అంగీకరించబోము. వందేమాతరం సంపూర్ణ గేయ గౌరవం, హుందాతనం, వారసత్వం, జాతీయ స్ఫూర్తిని బీజేపీ కాపాడుతుంది. అలాగే, వందేమాతరాన్ని అత్యంత స్వచ్ఛమైన జాతీయ భావనతో ముడిపడి ఉన్న "సామ్రాజ్యవాద వ్యతిరేక నినాదం"గా అభివర్ణిస్తూ మహాత్మా గాంధీ చేసిన వ్యాఖ్యలను కూడా బీజేపీ ప్రజల్లోకి తీసుకెళ్తుంది. వందేమాతరం చరిత్ర, అర్థం, జాతీయ ప్రాముఖ్యత, వారసత్వాన్ని భారతదేశంలోని ప్రతి మూలకు చేరవేసేందుకు బీజేపీ ఒక ప్రచారాన్ని ప్రారంభిస్తుంది. అంతేకాకుండా, వందేమాతరం ఆలపించడంపై ఆంక్షలు విధించిన చారిత్రక, రాజకీయ పరిస్థితులను అంటే ముస్లిం లీగ్ అభ్యంతరాలు, తదనంతరం పెరిగిన మతపరమైన, వేర్పాటువాద డిమాండ్ల రాజకీయాలను ప్రజలకు వివరించాలని పార్టీ నిర్ణయించింది. 1947లో భారతదేశ స్వాతంత్ర్య విజయ నినాదం 'వందేమాతరం'. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో 2047 నాటి 'అభివృద్ధి చెందిన భారతదేశం' (వికసిత్ భారత్) గొప్ప ప్రకటనకు కూడా 'వందేమాతరం' నినాదమే కానుంది."

**నితిన్ నబీన్, బీజేపీ జాతీయ అధ్యక్షుడు**

కాంగ్రెస్ పార్టీ లేదా దాని వర్కింగ్ కమిటీ గానీ తమను తాము పార్లమెంట్ కంటే గొప్పగా భావించకూడదని బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి, ఎంపీ సంబిత్ పాత్ర అన్నారు. "ఈ రోజు నేను దేశాన్ని అడగదలుచుకున్నాను. పార్లమెంట్ గొప్పదా లేక జబౌజ గొప్పదా? దేశం పార్లమెంట్‌లో తీసుకున్న నిర్ణయాల ఆధారంగా నడుస్తుందా లేక జబౌజ ఆమోదించిన నిర్ణయాలు, తీర్మానాల ఆధారంగా నడుస్తుందా?

ప్రజా న్యూస్ నెట్ వర్క్ దినపత్రిక

ఆదివారం 23-08-2026

## నలపరెడ్డిపల్లి మురగళ్ల కనుపూరుపల్లి రహదారి పనులు వెంటనే ప్రారంభించాలి-తోడేటి అశోక్



**అనంతసాగరం ఆగష్టు 22 ప్రజాన్యూస్ నెట్ వర్క్ :** ఆత్మకూరు నలపరెడ్డిపల్లి మురగళ్ల కనుపూరుపల్లి రహదారి అధ్వానంగా మారడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆత్మకూరు మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు తోడేటి అశోక్ తెలిపారు.గతంలో జీజదీతో రహదారి పనులు ప్రారంభించి, అనంతరం పనులు నిలిచిపోవడంతో రహదారిని అస్తవ్యస్తంగా వదిలేశారని పేర్కొన్నారు. గతంలో మంజూరైన పనులు రద్దయ్యాయని, ప్రస్తుతం మళ్లీ రహదారి పనులకు అనుమతి వచ్చినట్లు అధికారులు చెబుతున్నప్పటికీ పనులు ఎప్పుడు ప్రారంభమవుతాయో స్పష్టత లేదన్నారు.ఈ సమస్యపై సంబంధిత ౫×ఖ ాజు అధికారిని పలుమార్లు కలిసి =౫× ద్వారా వివరాలు కోరడంతో పాటు నెల్లూరు కార్యాలయాన్ని కూడా సంప్రదించినట్లు తెలిపారు.ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని రహదారి పనులను త్వరితగతిన ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆత్మకూరు =ఖా మేడం గారికి అర్జీ అందజేశారు.ఈ కార్యక్రమంలో సుమంత్ హరిబాబు బద్రి రాజా వెంకటేష్ తో పాటు నలపరెడ్డిపల్లి, మురగళ్ల కనుపూరుపల్లి గ్రామాలకు చెందిన యువత పాల్గొన్నారు.

## సోషల్ మీడియాతో అప్రమత్తంగా ఉండాలి: ఎస్పీ నరసింహ

**మహిళలు, బాలికల భద్రతకు పోలీసుల ప్రత్యేక చర్యలు**

**ప్రజా భరోసా, సఖీ కేంద్రాల ద్వారా అవగాహన కార్యక్రమాలు**




**సూర్యాపేట జిల్లా ప్రతినిధి ఆగస్టు 22 ప్రజా న్యూస్ నెట్‌వర్క్ షేక్అబ్దుల్ రజాక్ జిల్లా ప్రతినిధి :** మారుతున్న కాలానికి అనుగుణంగా మహిళలు, బాలికల రక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ అన్నారు. మహిళలు, చిన్నారుల భద్రత కోసం జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ప్రజా భరోసా, సఖీ కేంద్రాల ద్వారా ప్రత్యేక అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా బాలికలు, మహిళలు సోషల్ మీడియా వేదికలను ఉపయోగించే సమయంలో అప్రమత్తంగా ఉండాలని, పరిచయం లేని వ్యక్తులతో వ్యక్తిగత వివరాలు, ఫొటోలు, ఇతర సమాచారాన్ని పంచుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సోషల్ మీడియా ద్వారా జరిగే మోసాలు, వేధింపులు, ఇతర సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. ఏదైనా అనుమానాస్పద పరిస్థితి ఎదురైనప్పుడు భయపడకుండా కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులు లేదా పోలీసుల సహాయం తీసుకోవాలని సూచించారు. బాలికల మానసిక వికాసం, ఆరోగ్యం, భద్రత పట్ల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని ఎస్పీ కోరారు. మహిళలు, చిన్నారులకు సురక్షితమైన వాతావరణం కల్పించేందుకు పోలీస్ శాఖ నిరంతరం పనిచేస్తుందని, ప్రజలు కూడా పోలీసులకు సహకరించాలని తెలిపారు.

## కస్తాల చిరంజీవి కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ ఆర్థిక చేయూత

**దశదిన కర్మకు 50 కిలోల బియ్యం అందజేత**

**కుటుంబానికి అండగా నిలిచిన పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు గెల్లి రవి**

**సూర్యాపేట జిల్లా ప్రతినిధి ఆగస్టు 22 ప్రజా న్యూస్ నెట్‌వర్క్ షేక్. అబ్దుల్ రజాక్ జిల్లా ప్రతినిధి :** హుజూర్‌నగర్ పట్టణంలోని 11వ వార్డులో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్త కస్తాల చిరంజీవి కుటుంబాన్ని పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గెల్లి రవి పరామర్శించి దశదిన కర్మ కోసం 50 కిలోల బియ్యాన్ని అందజేశారు. కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మాజీ జడ్పీటీసీ గల్లా వెంకటేశ్వర్లు, ఐఎన్‌టీయూసీ మండల అధ్యక్షులు మేళ్లచెరువు ముక్కంటి, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి కస్తాల సైదులు, కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు కస్తాల దిల్ తదితరులు పాల్గొన్నారు.

## బెజ్జికల్‌లో బాధిత కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే జయవీర్ రెడ్డి

**మృతురాలు ఇండ్ల నరసమ్మకు ఘన నివాళులు.. అనారోగ్యంతో ఉన్న బొల్లిగొర్ల శ్రీనుకు ఆర్థిక సాయం**

**బాధిత కుటుంబాలకు అండగా నిలిచిన నాగార్జునసాగర్ ఎమ్మెల్యే**



**త్రిపురారం మండలం ఆగస్టు 22 ప్రజా న్యూస్ నెట్‌వర్క్ :** నాగార్జునసాగర్ నియోజకవర్గంలోని త్రిపురారం మండలం బెజ్జికల్ గ్రామంలో సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇండ్ల నాగరాజు నానమ్మ ఇండ్ల నరసమ్మ ఇటీవల వృద్ధాప్యంతో మృతి చెందడంతో స్థానిక ఎమ్మెల్యే కుందూరు జయవీర్ రెడ్డి గ్రామ నాయకులు, మండల నాయకులతో కలిసి ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం శోకసంద్రంలో ఉన్న కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అదే గ్రామంలో తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న బోల్లిగొర్ల శ్రీనును పరామర్శించి వైద్య ఖర్చుల కోసం రూ.5,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని ఎమ్మెల్యే తెలిపారు.

## స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర లక్ష్యానికి ప్రతి ఒక్కరి భాగస్వామ్యం అవసరం: యనమల దివ్య


**టి.వెంకటాపురంలో స్వచ్ఛ రథం ప్రారంభం..**

**పరిశుభ్రతపై ప్రజలకు ప్రభుత్వ విప్ పిలుపు**



**తుని, ఆగస్టు 22 ప్రజా న్యూస్ నెట్వర్క్:** స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర లక్ష్యాల సాధనకు ప్రజలంతా భాగస్వాములు కావాలని ప్రభుత్వ విప్ యనమల దివ్య పిలుపునిచ్చారు. తుని మండల టీడీపీ అధ్యక్షుడు చింతంనీడి అబ్బాయి అధ్యక్షతన టి.వెంకటాపురంలో నిర్వహించిన స్వర్ణాంధ్ర--స్వచ్ఛాంధ్ర కార్యక్రమానికి సీనియర్ నేత యనమల రాజేష్‌తో కలిసి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కూటమి నాయకులు యనమల దివ్యకు ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో భాగంగా గ్రామంలో ఏర్పాటు చేసిన సోలార్ ప్యానెల్స్‌ను యనమల దివ్య పరిశీలించారు. నియోజకవర్గంలో సోలార్ ప్యానెల్స్ కార్యక్రమం అమలు జరుగుతున్న తీరును సంబంధిత నాయకులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సీనియర్ నేత యనమల రాజేష్, ఎంపీడీవో రవి వర్మ, మండల టీడీపీ అధ్యక్షుడు చింతంనీడి అబ్బాయి, స్థానిక నాయకులతో కలిసి స్వచ్ఛ రథాన్ని యనమల దివ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతపై ప్రతి ఒక్కరూ శ్రద్ధ వహించాలని సూచించారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రతి పంచాయతీని స్వచ్ఛ పంచాయతీగా తీర్చిదిద్దేందుకు అందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కలగా శ్రీను, బంధం బుజ్జి, ఖాతా గోవిందు, పప్పు నవీన్, కాసపు తాతారావు, గింజాల రాజులు, ఈసరపు గణపతి, దార్ల సత్యనారాయణ, పప్పు వీరబాబు, గజ్జి రాంబాబు, బంధం రాజయ్య, చామంతి సత్తిబాబు, కొల్లు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## పిట్టలగూడెం గ్రామంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



**గుర్రంపోడు: ఆగస్టు 22 ప్రజా న్యూస్ :ప్రతినిధి దోటి. శ్రీను :** అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ప్రభుత్వ పథకాలు అందడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని మండల నాయకులు సుదిని జగదీశ్వర్ రెడ్డి తెలిపారు. శనివారం మండల పరిధిలోని పిట్టలగూడెం గ్రామంలో లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం ఆయన ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది.ఈ సందర్భంగా జగదీశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. నూతనంగా పంపిణీ చేసిన స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా లబ్ధిదారులకు మరింత పారదర్శకంగా, వేగంగా సేవలు అందుతాయని పేర్కొన్నారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు చేకూర్చేందుకు నిరంతరం కృషి చేస్తామని ఆయన స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి, గ్రామ పరిపాలన అధికారి వీఆర్వో , ఉప సర్పంచ్, వార్డు మెంబర్లు, గ్రామ పెద్దలు, యువకులు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## దేవాలయ భూ పరిరక్షణ కై సంతకాల సేకరణ విజయవంతం -అఖిల పక్ష నాయకుల



**కుత్బుల్లాపూర్ ఆగస్టు 22 ప్రజా న్యూస్ నెట్వర్క్ :** జగద్గిరిగుట్ట శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి ఆలయ భూములను పరోరక్షించాలని కోరుతు నేడు నిర్వహించిన సంతకాల సేకరణ కు ప్రజల నుండీ మంచి మద్దత్తు.రావడమే కాకుండా పూర్తీ సహాయ సహకారాలు ఉంటాయని పేర్కొన్నారు.ఈ సందర్భంగా అఖిల పక్షాల నాయకులూ సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్, జనసేన నాయకులు సతీష్ బీజేపీ మాధవులు మాట్లాడుతూ దేవాలయ భూమి పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో నేడు ప్రజల మద్దతు కోసం సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించగా ప్రజల నుండే కాకుండా వివిధ ఇతర రాజకీయ పార్టీల,బస్తి నాయకుల మద్దతు పెద్ద ఎత్తున వచ్చిందని అన్నారు. అధికారంలో ఉన్న పాలకులు,అధికారం అనుభవించిన వాళ్ళు ఆలయ భూములు అన్యాక్రాంతం అవుతుంటే పట్టించుకోక పోవడం దారుణమని,హై కోర్టు ఆదేశాలు ఇచ్చినప్పటికీ స్థానిక రెవిన్యూ అధికారులు పట్టించుకోక పోవడం,పిర్యాదు చేసిన అలసత్వం వహించడం వల్ల ఉన్న భూమి కూడా అన్యాక్రాంతం అవుతుందని ఇప్పటికైనా అధికారులు ఫిర్యాదు చేసిన వెంటనే స్పందించి అక్రమ కట్టడాలను కూల్చివేసి ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని డిమాండ్ చేశారు. ఈ ఉద్యమం భూములను సర్వే చేసి ప్రభుత్వం ఆధీనంలోకి తీసుకునేంతవరకు కొనసాగుతుందని అన్నారు. కావున రెవెన్యూ అధికారులు వెంటనే హైకోర్టు ఆర్డర్ ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమానికి సహకరించిన ప్రజలందరికీ ధన్యవాదాలు తెలియజేస్తూ రానున్న రోజుల్లో చేసే ఉద్యమంలో కలిసి రావాలని దేవాలయ భూములతో పాటు ప్రభుత్వం భూములు కూడా కాపాడుకొని భవిష్యత్ తరాలకు ఉపయోగపడేలా చూసుకోవాల్సిన బాధ్యత మనందరి పైన ఉందని అన్నారు.ఈ కార్యక్రమానికి మద్దతుగా బిఆర్ఎస్ అధ్యక్షులు రుద్రా అశోక్,ప్రజానాట్యమండలి అధ్యక్షుడు బాబు,మాజీ గుడి చైర్మన్ పిల్లి ఆంజనేయులు, ఆకుల సతీష్ అండ్ టీం ఆకుల సతీష్,జైశంకర్,యెర్ర యాకన్నా,వీరన్న,ముకేశ్,వంశీ లతో పాటు వందలాది మంది మద్దతుగా సంతకాలు చేసి తమ సంఘీభావాన్ని ప్రకటించారు.

## డ్రాఫ్ట్ ఓటర్ లిస్టులపై కాంగ్రెస్ ప్రత్యేక దృష్టి

**వార్డు ఇన్‌చార్జిలు, బీఎల్‌ఏలకు ఓటర్ జాబితాల పంపిణీ**

**అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును కాపాడుకోవాలి**



**సూర్యాపేట జిల్లా ప్రతినిధి ఆగస్టు 22 ప్రజా న్యూస్ నెట్‌వర్క్ షేక్.అబ్దుల్ రజాక్ జిల్లా ప్రతినిధి :** హుజూర్‌నగర్ పట్టణంలో మంత్రి కెప్టెన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు గెల్లి రవి ఆధ్వర్యంలో డ్రాఫ్ట్ ఓటర్ జాబితాలపై ప్రత్యేక దృష్టి సారించారు. ఎన్నికల సంఘం విడుదల చేసిన డ్రాఫ్ట్ ఓటర్ లిస్టులను పట్టణంలోని వివిధ వార్డుల ఇన్‌చార్జిలు, బూత్ లెవల్ ఏజెంట్లకు అందజేశారు. ఈ సందర్భంగా హుజూర్‌నగర్‌లోని మంత్రి క్యాంపు కార్యాలయంలో వార్డు ఇన్‌చార్జిలు, బీఎల్‌ఏలతో ప్రత్యేక సమావేశం నిర్వహించి ఆయా వార్డులకు సంబంధించిన డ్రాఫ్ట్ ఓటర్ జాబితాలను పంపిణీ చేశారు. 19వ వార్డు ఇన్‌చార్జి ఎండీ. అజీజ్ పాషాకు కూడా సంబంధిత డ్రాఫ్ట్ ఓటర్ జాబితాను అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ ఓటర్ జాబితాలో ప్రతి ఓటరు తన పేరు సక్రమంగా నమోదై ఉందో లేదో తప్పనిసరిగా పరిశీలించుకోవాలని సూచించారు. ఎస్‌ఐఆర్ ప్రక్రియలో భాగంగా జాబితాలో ఎవరి పేరు కనిపించకపోయినా, పేరులో ఏదైనా తప్పు ఉన్నా, ఓటరు వివరాల్లో మార్పులు అవసరమైనా లేదా ఏదైనా అభ్యంతరం, నోటీసు జారీ అయినా ప్రజలు నిర్లక్ష్యం చేయకుండా వెంటనే సంబంధిత వార్డు ఇన్‌చార్జి లేదా బీఎల్‌ఏలను సంప్రదించి అవసరమైన వివరాలను తెలుసుకోవాలని కోరారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమైనదని, అర్హత కలిగిన ప్రతి పౌరుడి పేరు ఓటర్ జాబితాలో ఉండేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఇప్పటికే ఓటర్ జాబితాలో పేర్లు ఉన్నవారు కూడా తమ పేరు, వయస్సు, చిరునామా, ఇతర వివరాలు సక్రమంగా ఉన్నాయా లేదా అనేది పరిశీలించుకోవాలని సూచించారు. ప్రతి వార్డుకు సంబంధించిన డ్రాఫ్ట్ ఓటర్ జాబితాలను బీఎల్‌ఏలు, వార్డు ఇన్‌చార్జిలు క్షుణ్ణంగా పరిశీలించి, జాబితాలో ఉన్న తప్పులు, అభ్యంతరాలు, అర్హులైన వారి పేర్లు నమోదు కాకపోవడం వంటి అంశాలను గుర్తించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని తెలిపారు. అర్హత ఉన్న ఏ ఒక్క పౌరుడి ఓటు హక్కు కూడా కోల్పోకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. ముఖ్యంగా కొత్తగా ఓటు హక్కు పొందే అర్హత కలిగిన యువత, చిరునామా మారిన వారు, జాబితాలో పేరు లేని అర్హులైన పౌరులు తమ వివరాలను పరిశీలించుకుని అవసరమైన ప్రక్రియను పూర్తి చేసుకునేలా బీఎల్‌ఏలు ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఓటర్ జాబితా సవరణ ప్రక్రియలో ప్రజలకు ఎలాంటి సందేహాలు ఉన్నా వాటిని నివృత్తి చేసేందుకు కాంగ్రెస్ పార్టీ వార్డు ఇన్‌చార్జిలు, బీఎల్‌ఏలు అందుబాటులో ఉండాలని నాయకులు తెలిపారు. ఓటు హక్కు కేవలం ఎన్నికల సమయంలో మాత్రమే గుర్తు చేసుకునే అంశం కాదని, ప్రతి పౌరుడి ప్రజాస్వామ్య హక్కు అని పేర్కొన్నారు. అందువల్ల ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును బాధ్యతగా కాపాడుకోవాలని, డ్రాఫ్ట్ జాబితాలను పరిశీలించి అవసరమైన సవరణలు ఉంటే సకాలంలో చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకులు పిలుపునిచ్చారు. పట్టణంలోని ప్రతి వార్డులో ఓటర్ జాబితాల పరిశీలనను పకడ్బందీగా నిర్వహించి అర్హులైన ఓటర్లందరి పేర్లు జాబితాలో ఉండేలా కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, వివిధ వార్డుల ఇన్‌చార్జిలు, బూత్ లెవల్ ఏజెంట్లు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు..

## తాళం పోయింది.. రెండు రోజులుగా గ్రామపంచాయతీ సేవలు బంద్.

**పింఛన్ల పంపిణీకి ఆటంకం.. అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం.**

**ధరావత్ నరసింహ ఫిర్యాదుతో స్పందించిన అధికారులు.. తాళం పగలగొట్టి కార్యాలయం తెరిచారు.**



**సూర్యాపేట జిల్లా ప్రతినిధి ఆగస్టు 22 ప్రజా న్యూస్ నెట్‌వర్క్ షేక్ అబ్దుల్ రజాక్ జిల్లా ప్రతినిధి :** చింతలపాలెం మండల పరిధిలోని ఎర్రకుంట తండా గ్రామపంచాయతీ కార్యాలయానికి సంబంధించిన తాళం పోవడంతో రెండు రోజులుగా కార్యాలయం మూసి ఉండటంపై గ్రామ ప్రజల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమైంది. గ్రామపంచాయతీ కార్యాలయం మూసి ఉండటంతో ప్రజలకు అందాల్సిన పలు సేవలకు ఆటంకం ఏర్పడటంతో పాటు పింఛన్ల పంపిణీకి కూడా ఇబ్బందులు ఎదురయ్యాయని నిరుద్యోగ జేఏసీ నాయకులు ధరావత్ నరసింహ ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం పింఛన్లు పంపిణీ చేసేందుకు అధికారులు గ్రామపంచాయతీ కార్యాలయానికి వచ్చినప్పటికీ కార్యాలయానికి తాళం వేసి ఉండటంతో వారు వెనుదిరిగి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. ఎర్రకుంట తండాకు చెందిన పింఛన్‌దారులు ఎన్నో సంవత్సరాలుగా సుమారు మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న చింతలపాలెం మండల కేంద్రానికి వెళ్లి పింఛన్లు తీసుకుంటున్నారని, ఈ సమస్యను గుర్తించిన తాను గ్రామ యువతతో కలిసి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తండాలోనే పింఛన్లు అందేలా చర్యలు తీసుకునేందుకు ప్రయత్నాలు చేశామని నరసింహ తెలిపారు. తమ ప్రయత్నాల ఫలితంగా తండాలోనే పింఛన్లు అందే అవకాశం ఏర్పడిందని భావించిన సమయంలో గ్రామపంచాయతీ కార్యాలయానికి తాళం వేసి ఉండటంతో పింఛన్ల పంపిణీ మళ్లీ వాయిదా పడే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామపంచాయతీ కార్యదర్శి, సిబ్బంది సమయపాలన పాటించడంపై కూడా తండా ప్రజల్లో అసంతృప్తి ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ విషయంపై గ్రామ ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో తాను స్వయంగా గ్రామపంచాయతీ కార్యాలయానికి వెళ్లి పరిస్థితిని పరిశీలించినట్లు తెలిపారు. కార్యాలయానికి తాళం లేకపోవడం, రెండు రోజులుగా సేవలు నిలిచిపోవడం వంటి అంశాలపై సంబంధిత ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానని స్పష్టం చేశారు. ప్రజలకు అందాల్సిన ప్రభుత్వ సేవలు సక్రమంగా అందేలా అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. విషయం అధికారుల దృష్టికి వెళ్లడంతో వారు వెంటనే స్పందించి గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద ఉన్న తాళాన్ని పగలగొట్టి కార్యాలయాన్ని తెరిచారు. దీంతో పంచాయతీ సేవలు తిరిగి అందుబాటులోకి వచ్చే అవకాశం ఏర్పడింది. ఇకపై ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా గ్రామపంచాయతీ అధికారులు సమయపాలన పాటిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు. ముఖ్యంగా పింఛన్‌దారులు దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా తండాలోనే పింఛన్ల పంపిణీ సక్రమంగా జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## సమాజంలో మార్పు కోసం ఉపాధ్యాయులు కృషి చేయాలి.

**విద్య, వైద్యం, భద్రతతోనే సమాజ అభివృద్ధి: కలెక్టర్ తేజస్ నందాల్ పవార్**

**బాలల హక్కుల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు.. బాలలను పనులకు పంపితే కఠిన చర్యలు**




**సూర్యాపేట జిల్లా ప్రతినిధి ఆగస్టు 22 ప్రజా న్యూస్ నెట్‌వర్క్ షేక్. అబ్దుల్ రజాక్ జిల్లా ప్రతినిధి :** సమాజ అభివృద్ధికి విద్య, వైద్యం, భద్రత ఎంతో కీలకమైన అంశాలని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందాల్ పవార్ అన్నారు. భావితరాలను తీర్చిదిద్దాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, ముఖ్యంగా విద్యార్థుల భవిష్యత్తును నిర్మించడంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు వారిలో క్రమశిక్షణ, సామాజిక బాధ్యత, మానవీయ విలువలు, మంచి ఆలోచనా విధానాన్ని పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. పాఠశాలలు కేవలం విద్యను అందించే కేంద్రాలుగా కాకుండా మంచి పౌరులను తీర్చిదిద్దే వేదికలుగా పనిచేయాలని సూచించారు. పిల్లల హక్కుల పరిరక్షణకు జిల్లా యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపట్టిందని, ప్రతి పాఠశాలలో బాలల రక్షణ అధికారులను నియమించినట్లు తెలిపారు. విద్యార్థులకు పాఠశాలల్లో సురక్షితమైన వాతావరణం కల్పించడంతో పాటు వారి సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించేలా సంబంధిత అధికారులు, ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. బాలలను చదువుకు దూరం చేసి పనులకు పంపించడం వల్ల వారి భవిష్యత్తు దెబ్బతింటుందని, పిల్లలను పనులకు పంపించే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. ప్రతి బాలుడు పాఠశాలకు వెళ్లి విద్యను అభ్యసించేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని అన్నారు. బాలల హక్కులను కాపాడటం కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, సమాజంలోని ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా భావించాలని కోరారు. విద్యార్థుల ఆరోగ్యం, భద్రతపై కూడా నిరంతరం పర్యవేక్షణ ఉండాలని, విద్యతో పాటు ఆరోగ్యకరమైన జీవన విధానం గురించి పిల్లలకు అవగాహన కల్పించాలని సూచించారు. విద్యా వ్యవస్థను మరింత మెరుగుపరిచేందుకు ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయడంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు సమిష్టిగా సహకరించాలని కలెక్టర్ కోరారు. సమాజంలో నెలకొన్న సమస్యలను గుర్తించి వాటిపై విద్యార్థులకు అవగాహన కల్పించడం ద్వారా భవిష్యత్ తరాల్లో బాధ్యతాయుతమైన ఆలోచనా విధానాన్ని పెంపొందించవచ్చని అన్నారు. విద్యార్థులను మంచి పౌరులుగా తీర్చిదిద్దడం ద్వారా సమాజంలో సానుకూల మార్పుకు బాటలు వేయవచ్చని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు తమ వృత్తిని కేవలం ఉద్యోగంగా కాకుండా సమాజ నిర్మాణంలో కీలకమైన బాధ్యతగా భావించి పనిచేయాలని కలెక్టర్ తేజస్ నందాల్ పవార్ పిలుపునిచ్చారు. విద్యారంగంలో ప్రతి ఒక్కరి సహకారంతో జిల్లాలో విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపరిచి, పిల్లలకు సురక్షితమైన, నాణ్యమైన విద్యా వాతావరణాన్ని కల్పించేందుకు కృషి చేయాలని సూచించారు.

## త్రిపురారంలో వీవో భవన నిర్మాణానికి శంకుస్థాపన

**మహిళా సంఘాల సమైఖ్య భవన నిర్మాణ పనులకు శ్రీకారం**

**కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్, పంచాయతీ పెద్దలు, అధికారులు**



**త్రిపురారం మండలం ఆగస్టు 22 ప్రజా న్యూస్ నెట్‌వర్క్ :** త్రిపురారం మండలం రూప్లాతండా గ్రామపంచాయతీ పరిధిలో మహిళా సంఘాల సమైఖ్య భవనం నిర్మాణానికి శనివారం శంకుస్థాపన చేశారు. వీవో భవన స్లాబ్ నిర్మాణ పనులను స్థానిక సర్పంచ్ ధనావత్ రఘు నాయక్, పంచాయతీ పెద్దలు బిచ్య నాయక్ సమక్షంలో ప్రారంభించారు. మహిళా సంఘాల కార్యకలాపాలకు భవనం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ధనావత్ రవి నాయక్, పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ, సంఘాల మెట్టు విజయ, భాస్కర్ నాయక్, వెంకట్రాం నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## పూర్ణాహుతితో మహా వరుణ యాగం ముగింపు..

**ఋష్యశృంగ మహర్షి విగ్రహ నిమజ్జనంతో వైదిక కార్యక్రమాలకు సంపూర్ణత**

**నాలుగు రోజులుగా యనమల గార్డెన్స్‌లో ఘనంగా యాగం..**

**తొమ్మిది దంపతులతో మహాశివునికి జలాభిషేకం**



**తేటగుంట, ఆగస్టు 22 ప్రజా న్యూస్ నెట్వర్క్:** తేటగుంటలోని యనమల గార్డెన్స్ భక్తజన సందోహంతో కిక్కిరిసింది. మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు, ప్రభుత్వ విప్ యనమల దివ్య ఆధ్వర్యంలో వరుణ కటాక్షం కోసం నిర్వహించిన మహా వరుణ యాగం పూర్ణాహుతితో ముగిసింది. నాలుగు రోజులుగా యనమల గార్డెన్స్‌లో ఋత్వికుల వేదమంత్రోచ్చారణల మధ్య కొనసాగిన వైదిక కార్యక్రమాలు చివరి రోజుకు చేరుకున్నాయి. యనమల రామకృష్ణుడు, విజయలక్ష్మీ దంపతుల పర్యవేక్షణలో వరుణ యాగంలో పాల్గొన్న తొమ్మిది మంది దంపతులతో మహాశివునికి జలాభిషేకం నిర్వహించారు. జలాభిషేకం అనంతరం ఋత్వికులు వేదమంత్రాలతో హోమ కార్యక్రమాలు నిర్వహించగా, వేదపండితులు తొమ్మిది మంది దంపతులతో కలిసి ప్రత్యేక యాగ పూజలు నిర్వహించారు. అనంతరం శాస్త్రోక్తంగా పూర్ణాహుతి నిర్వహించి మహా వరుణ యాగానికి ముగింపు పలికారు. ఈ పూజా కార్యక్రమాల్లో ప్రభుత్వ విప్ శ్రీమతి యనమల దివ్య--గోపీనాథ్ దంపతులతో పాటు ప్రత్తిపాడు ఎమ్మెల్యే శ్రీమతి వరుపుల సత్యప్రభ పాల్గొన్నారు. యాగం ముగిసిన అనంతరం మంగళవాయిద్యాల నడుమ సుగంధ పుష్పాలతో అలంకరించిన పల్లకిలో ఋష్యశృంగ మహర్షి విగ్రహాన్ని ప్రతిష్ఠించి ఊరేగింపుగా రాజులకొత్తూరులోని కోనేరు వద్దకు తీసుకెళ్లారు. అక్కడ శాస్త్రోక్తంగా ఋష్యశృంగ మహర్షి విగ్రహ నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహించడంతో నాలుగు రోజులుగా కొనసాగిన మహా వరుణ యాగం పూర్తయింది.

## పాయకరావుపేటలో ఇంటింటా తెలుగుదేశం.

**సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన**

**లింగాల కాలనీలో ఇంటింటికీ వెళ్లిన టీడీపీ నేతలు..**



**పాయకరావుపేట, ఆగస్టు 22 ప్రజా న్యూస్ నెట్వర్క్:** పాయకరావుపేట తెలుగుదేశం పట్టణ పార్టీ అధ్యక్షుడు యాళ్ల వరహాల బాబు ఆధ్వర్యంలో ఇంటింటా తెలుగుదేశం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా స్థానిక లింగాల కాలనీలో టీడీపీ నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాల గురించి ప్రజలకు వివరించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాలు, చేపడుతున్న అభివృద్ధి పనులపై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించేలా నాయకులు వివరించారు. ఈ కార్యక్రమంలో వీసం మహేష్, జూరెడ్డి ప్రసాద్, టీడీపీ పట్టణ పార్టీ ఉపాధ్యక్షుడు చిరుకూరి పేర్రాజు, మండల తెలుగు యువత అధ్యక్షుడు గొల్లపల్లి నాగు, కడిమి శివ తదితరులు పాల్గొన్నారు.

## పాయకరావుపేటలో సందడిగా మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలు




**పాయకరావుపేట, ఆగస్టు 22 ప్రజా న్యూస్ నెట్వర్క్:** మెగా స్టార్ చిరంజీవి జన్మదినాన్ని పురస్కరించుకుని పాయకరావుపేటలో ఆయన అభిమానులు శనివారం వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక లక్ష్మీ థియేటర్ ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమంలో అభిమానులు కేక్ కట్ చేసి చిరంజీవికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా అభిమానులు ఉత్సాహంగా నినాదాలు చేస్తూ వేడుకల్లో పాల్గొన్నారు. “చిరంజీవి జిందాబాద్” అంటూ నినాదాలు చేస్తూ తమ అభిమానాన్ని చాటుకున్నారు.కార్యక్రమంలో చిరంజీవి అభిమానులు గెడ్డం చైతన్య, రాజా రమేష్, ఐ.ఎన్. మూర్తి, ఇంజరపు సూరిబాబు, నాగేశ్వరరావు, చిలుకూరీ పేర్రాజు, బిఎస్ నారాయణ, ముక్కుడుపల్లి నాగరాజు, చరణ్, చందు తదితరులు పాల్గొన్నారు.ాపర్‌వైజర్లు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

# చిరంజీవి జన్మదిన వేడుకలకు సేవా బాట..

**- తుని ఏరియా ఆసుపత్రిలో 20 మందితో రక్తదానం**

**- అఖిల భారతీయ చిరంజీవి యువత-మెగా యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో శిబిరం..**

**- యువత స్వచ్ఛంద రక్తదానానికి ముందుకు రావాలని వైద్యుల పిలుపు**

**తుని ఆగస్టు 22 ప్రజా న్యూస్ నెట్వర్క్:** మెగాస్టార్ చిరంజీవి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని అఖిల భారతీయ చిరంజీవి యువత--మెగా యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో తుని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి రక్తనిధిలో రక్తదాన శిబిరం నిర్వహించారు. కోడూరు సురేష్, చిరంజీవి అభిమాన సోదరులు చోడిశెట్టి భాస్కర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సుమారు 20 మంది యువత స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా డీసీహెచ్ఎస్, ఏరియా హాస్పిటల్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ కె. మహేశ్వరరావు రక్తదాతలు, కార్యక్రమ నిర్వాహకులను అభినందించారు. రక్తదానం ద్వారా అత్యవసర పరిస్థితుల్లో ఉన్న రోగులకు ప్రాణదానం చేసే అవకాశం ఉంటుందని, యువత సేవా కార్యక్రమాల్లో మరింతగా భాగస్వాములు కావాలని సూచించారు.ఆర్ఎంఓ డాక్టర్ సత్యనారాయణ రక్తదాతలను అభినందిస్తూ వారి సేవలను ప్రశంసించారు. డాక్టర్ జి. రవికిరణ్ రక్తదానం ప్రాధాన్యతను వివరించి, రక్తదాతల సేవలను అభినందించారు. ఇలాంటి సేవా కార్యక్రమాలను మరింతగా నిర్వహించేందుకు యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు.ఏరియా హాస్పిటల్ రక్తనిధి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జె. హరిచంద్ర రక్తదాతలకు కృతజ్ఞతలు తెలిపారు. అత్యవసర సమయాల్లో రక్తం అందుబాటులో ఉండేందుకు స్వచ్ఛంద రక్తదానం ఎంతో అవసరమని పేర్కొన్నారు. కార్యక్రమ నిర్వాహకులు కోడూరు సురేష్ మాట్లాడుతూ అఖిల భారతీయ చిరంజీవి యువత--మెగా యూత్ ఫోర్స్ తరపున రక్తదాతలకు కృతజ్ఞతలు తెలిపారు. మెగాస్టార్ చిరంజీవి సేవా స్ఫూర్తితో మరిన్ని సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. జిల్లా జనసేన కార్యదర్శి వంగలపూడి నాగేంద్ర రక్తం ఆవశ్యకతను వివరించారు. ప్రతి ఒక్కరూ రక్తదానం ప్రాధాన్యతను గుర్తించి, అవకాశం ఉన్నప్పుడల్లా ఏరియా హాస్పిటల్ రక్తనిధిలో స్వచ్ఛందంగా రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. అత్యవసర పరిస్థితుల్లో రోగులకు రక్తం అందిస్తూ సేవలందిస్తున్న ఏరియా



హాస్పిటల్‌ను అభినందించారు. ఆసుపత్రి నర్సింగ్ సూపరింటెండెంట్ మాలతీ రాణి రక్తదాతలను దగ్గరుండి పర్యవేక్షిస్తూ అవసరమైన సహకారం అందించారు. ఆసుపత్రి సిబ్బంది రక్తదాతలు, కార్యక్రమ నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. "రక్తదానం చేయండి.ప్రాణదాతలుగా నిలవండి" అనే సందేశాన్ని ఈ సందర్భంగా యువత సమాజానికి అందించారు. శిబిరం విజయవంతంగా నిర్వహించడంలో అఖిల భారతీయ చిరంజీవి యువత–మెగా యూత్ ఫోర్స్ నిర్వాహకులు కోడూరు సురేష్‌తో పాటు జనసేన నాయకులు వి. నాగేంద్ర, సి.హెచ్. భాస్కర్, జనసేన యువనాయకులు దుబ్బాసి ప్రసన్న, కుర్ర శివకృష్ణ సహకరించారు. కార్యక్రమ నిర్వహణలో చురుకుగా పాల్గొని రక్తదాతలను ప్రోత్సహించడంతో పాటు స్వయంగా రక్తదానం చేశారు. అత్యవసర సమయాల్లో రక్తం అవసరమైన వారికి అండగా నిలిచేందుకు యువత స్వచ్ఛందంగా రక్తదానం చేయడం అభినందనీయమని ఆసుపత్రి అధికారులు, సిబ్బంది పేర్కొన్నారు. యువత సేవా స్ఫూర్తి మరెందరికో ఆదర్శంగా నిలుస్తుందని వారు అభినందించారు.

# గడ్లబీడులో ఘనంగా శ్రీరామ ఆలయ ప్రతిష్ఠాపన..

**- లోకకల్యాణం, గ్రామ సౌఖ్యం కోసం ప్రత్యేక పూజలు.-గోపుర కలశస్థాపన అనంతరం హోమం, పూర్ణాహుతి..-శ్రీరామ దీక్ష భక్తులతో ఆధ్యాత్మిక కార్యక్రమాలు**

**తుని, ఆగస్టు 22 ప్రజా న్యూస్ నెట్వర్క్:** గడ్లబీడు గ్రామంలో నూతన శ్రీరామ ఆలయ ప్రతిష్ఠాపన అనంతరం ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ గోపుర కలశస్థాపన పూర్తయిన అనంతరం స్వామివారికి హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీరామ తత్వం, హిందూ ధర్మానికి సంబంధించిన విశేషాలను భక్తులకు వివరించారు. గ్రామంలో శ్రీరామ దీక్ష (కార్యదీక్ష) తీసుకున్న భక్తులు ప్రత్యేకంగా నిర్వహించిన హోమం, పూర్ణాహుతి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పూర్ణాహుతి ద్రవ్యాలతో ముడుపు కట్టి హోమాగ్నిలో సమర్పించారు. అనంతరం శ్రీరామ అక్షర పట్టాభిషేకం చేసిన పుస్తకాలను భద్రాచలానికి తీసుకెళ్లి శ్రీరామ స్వామివారికి సమర్పించనున్నట్లు తెలిపారు. లోకకల్యాణం, గ్రామ సౌఖ్యం కోసం ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఆధ్యాత్మిక కార్యక్రమంలో భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని స్వామివారి పూజల్లో భాగస్వాములయ్యారు.శ్రీరామ దీక్ష తీసుకున్న భక్తులు భద్రాచలం యాత్రకు వెళ్లి స్వామివారిని దర్శించుకున్న అనంతరం తిరిగి గడ్లబీడుకు చేరుకుని దీక్ష విరమణ చేయనున్నట్లు



తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన వివరాలను అఖిలభారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, విశ్వహిందూ మహా సంఘ భారత్ (వరల్డ్ హిందూ ఫెడరేషన్), ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాంస్కృతిక విభాగం ప్రధాన కార్యదర్శి మీ ఉటా భవాని స్వామి తెలిపారు.

# ఫీజు బకాయి - బీజేపీ లడాయి

**కుత్బుల్లాపూర్ ఆగస్టు 22 ప్రజా న్యూస్ నెట్వర్క్ :** తెలంగాణ విద్యార్థుల పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ, తెలంగాణ బీజేపీ అధ్యక్షులు రామచందర్ రావు 23 మరియు 24 తేదీల్లో చేపట్టబోయే నిరాహార దీక్ష సందర్భంగా, మేడ్చల్--మల్కాజ్‌గిరి అర్బన్ జిల్లా బీజేపీ అధ్యక్షులు గిరి వర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా సమావేశం నిర్వహించడం జరిగింది.ఈ సమావేశంలో జిల్లా దీజేవీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని, విద్యార్థుల హక్కుల కోసం జరుగుతున్న "ఫీజు బకాయి బీజేపీ లడాయి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయాలని నిర్ణయించారు.అందులో భాగంగా నాంపల్లి రాష్ట్ర బీజేపీ కార్యాలయానికి పెద్ద సంఖ్యలో దీజేవీ నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చరూ.



# భూమి రిజిస్ట్రేషన్ ఆపే అధికారం అధికారులకు ఉందా?

భారత రాజ్యాంగం పౌరులకు ప్రసాదించిన అత్యంత కీలకమైన రక్షణల్లో ఆస్తి హక్కు ఒకటి. రాజ్యాంగంలోని అధికరణ 300-ఏ ప్రకారం 'చట్టబద్ధమైన అధికారం లేకుండా పౌరులను తమ ఆస్తి నుంచి దూరం చేయరాదు'. ఇక్కడ 'చట్టం' అంటే ప్రజాప్రాతినిధ్య శాసనసభలు చేసిన శాసనమే తప్ప, రెవెన్యూ అధికారుల అంతర్గత సర్క్యులర్లు, ఎగ్జిక్యూటివ్ మెమోలు లేదా రాతపూర్వక లేఖలు కావు. అయినా వాటికి దిక్కులేకుండా పోయింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభ చేసిన చట్టంలో ఈ సెక్షన్ చాలా భయంకరంగా తయారైందని 2012లో హైకోర్టు తీవ్రంగా విమర్శించింది. తీర్పులో కఠినమైన ఆదేశాలు జారీ చేసింది ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో 2012లో దాఖలైన మొత్తం 35,000 రిట్ పిటిషన్లలో 3,360 పిటిషన్లు (దాదాపు 10% కేసులు) కేవలం సబ్ రిజిస్ట్రార్లు సెక్షన్ 22-ఏ పేరుతో దస్తావేజులను తిరస్కరించడానికి సంబంధించినవే. అప్పుడు ప్రభుత్వం ఒకవైపు వేలాది ఎకరాల రిజిస్ట్రేషన్లను అడ్డుకుంటూ ప్రజలను వేధిస్తూ ఉండింది. మరోవైపు లక్షలాది రూపాయల స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజుల రూపంలో రావాల్సిన ప్రభుత్వ ఖజానా ఆదాయాన్ని కోల్పోతున్నది. అంతిమంగా ప్రభుత్వానికి దక్కిన ప్రజాభూమి రక్షణ శూన్యం, ప్రజలకు మిగిలిన వేధింపులు అనంతం. ఈ విపత్కర పరిస్థితుల్లోనే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సీవీ నాగార్జున్‌రెడ్డి చరిత్రాత్మకమైన తీర్పు ఇచ్చారు. కానీ రిజిస్ట్రేషన్ చట్టం, 1908లోని 'సెక్షన్ 22-ఏ' అనే ఒకే ఒక్క ఉప నిబంధన ఇవాళ అవినీతి, ప్రజల నిస్సహాయత, అధికారుల నిరంకుశత్వానికి పరాకాష్టగా మారింది. సెక్షన్ 22-ఏ చదివితే దాని వెనుక ఉన్న శాసన ఉద్దేశం చాలా స్పష్టమైనదని అనుకుంటున్నాం. ప్రభుత్వ భూములు, దేవాదాయ, ధర్మాదాయ, వక్ఫ్ ఆస్తులు, సీలింగ్ చట్టాల కింద ప్రభుత్వానికి మిగులు భూములు, ప్రజాప్రయోజనాల కోసం కేటాయించిన స్థలాలు అన్యాక్రాంతం కాకుండా, ప్రైవేట్ వ్యక్తుల పేర్లతో నకిలీ దస్తావేజులు పుట్టకుండా కాపాడేందుకు మాత్రమే దీనిని ఒక 'చట్టబద్ధ రక్షణ కవచం'గా ప్రవేశపెట్టారని అన్నారు. కానీ కాలక్రమేణా ఇది సామాన్య ప్రజలను దోపిడీ చేసే ఒక 'పరిపాలనా వేధింపుల అస్త్రం'గా మారిపోయింది. స్పష్టమైన యాజమాన్య హక్కులు ఉండి, 1930, 1940 నుంచీ చట్టబద్ధమైన రిజిస్టర్డ్ దస్తావేజులు కలిగి ఉండి, ప్రభుత్వానికి భూమి శిస్తు చెల్లిస్తూ, చట్టబద్ధమైన పట్టాదార్ పాసుపుస్తకాలు ఉన్న సాధారణ రైతులు, పౌరులు తమ ఆస్తిని అమ్ముకోలేని పరిస్థితిని ప్రభుత్వం కల్పించింది. ఏకపక్ష 'నిషిద్ధ జాబితాల' కారణంగా లక్షలాది కుటుంబాలు నరకయాతనను అనుభవిస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో వందేండ్లకు పూర్వం (1909) నాటి రీసెటిల్‌మెంట్ రిజిస్టర్లలో పట్టాదార్ పేరు కాలమ్‌లో ఖాళీగా ఉండటం లేదా కేవలం చుక్కలు పెట్టడం వల్ల, వాటిని రెవెన్యూ యంత్రాంగం ఏకపక్షంగా 'ప్రభుత్వ భూమి'గా రికార్డుల్లో నమోదు చేసింది. ఈ సమస్య పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేకంగా 'చుక్కల భూముల చట్టం' చేయాల్సి వచ్చిందంటే, పరిపాలనా వైఫల్యం ఎంతటి తీవ్ర స్థాయికి చేరిందో అర్థం చేసుకోవచ్చు. సెక్షన్ 22-ఏ దుర్వినియోగం కేవలం ఒక న్యాయపరమైన వివాదం మాత్రమే కాదు, ఇది లక్షలాది కుటుంబాల జీవనాధారాన్ని దెబ్బతీసిన సామాజిక, ఆర్థిక సంక్షోభం. సామాన్య మధ్యతరగతి పౌరుడికి లేదా రైతుకు తన జీవితకాలంలో సంపాదించుకున్న ఆస్తి, భూమిని అమ్ముకుందామనుకుంటే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఆ దస్తావేజును స్వీకరించడానికి తిరస్కరిస్తుంది. ఆ సర్వే నంబర్‌ను నిషిద్ధ జాబితాలో చేర్చారనో లేదా అది ఏడబ్ల్యూడీ (అసెస్డ్ వేస్ట్ డ్రై) అనో స్థానిక తహసీల్దార్ కారణం చూపుతారు రిజిస్ట్రేషన్ చట్టం, 1908లో ఎక్కడా 'నో అబ్జెక్షన్ సర్టిఫికెట్" అనే భావనే లేదు. కానీ సబ్ రిజిస్ట్రార్లు ప్రజలను రెవెన్యూ అధికారుల వద్దకు వెళ్లి ఎన్వోసీ తీసుకురావాలని ఆదేశిస్తారు. ఇటు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, అటు తహసీల్దార్ /కలెక్టర్ కార్యాలయాల మధ్య పౌరులు ఏండ్ల తరబడి చెప్పులరిగేలా తిరగాల్సి వస్తున్నది. దేశ రక్షణలో సేవలందించిన మాజీ సైనికులకు ప్రభుత్వాలు భూములు కేటాయించాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం 10 ఏండ్ల లాక్ ఇన్ పీరియడ్ ముగిసిన తర్వాత వీరు ఈ భూములను అమ్ముకోవడానికి పూర్తి చట్టబద్ధమైన హక్కు ఉన్నది. అయినప్పటికీ అధికారులు దశాబ్దాల తర్వాత కూడా వీటిని సెక్షన్ 22-ఏ కింద బ్లాక్ చేసి వారి కుటుంబాలను వేధించారు. స్వాతంత్ర్య సమరయోధులకు కేటాయించిన భూములను ఎటువంటి షరతులు లేకుండా అమ్ముకోవచ్చు. వీరి వారసులను కూడా అక్రమంగా నిషేధిత జాబితాల్లో చేర్చి అధికారులు ఇబ్బందులకు గురిచేశారు. 1958 (తెలంగాణ ప్రాంతం), 1954 (ఆంధ్ర ప్రాంతం) కంటే ముందు ప్రభుత్వం ఇచ్చిన అసైన్‌మెంట్లలో ఎటువంటి 'అమ్మకం నిషేధ నిబంధనలు' లేవు. 1977లో వచ్చిన అసైన్డ్ భూముల బదిలీ నిషేధ చట్టం (రాజు 9 శీట 1977) ఈ పాత పట్టాలకు వర్తించదు. అయినా అధికారులు భూముల రిజిస్ట్రేషన్లను అడ్డుకున్నారు. 1. ఆర్ఎస్ఆర్ కాలమ్స్‌లోని చుక్కలు: 1909 నాటి రీ-సెటిల్‌మెంట్ రిజిస్టర్లలోని ఖాళీలను ప్రభుత్వ భూమిగా పరిగణించడం. 80-90 ఏండ్లుగా రిజిస్టర్డ్ దస్తావేజులు ఉన్న భూములను కూడా ఎటువంటి న్యాయ విచారణ లేకుండా ప్రైవేట్ వ్యక్తుల నుంచి లాక్కోవడం. 2. అసెస్డ్ వేస్ట్ డ్రై (ఏడబ్ల్యూడీ): ప్రైవేట్ వ్యక్తుల ఆధీనంలో ఉన్న భూములను కేవలం రికార్డులో 'ఏడబ్ల్యూడీ' అని ఉన్నదని కారణం చూపి రిజిస్ట్రేషన్లు నిలిపివేయడం. నిజంగా ప్రభుత్వ భూమి అయితే సివిల్ కోర్టులో దావా వేసి భూమిని స్వాధీనం చేసుకోవాలి కానీ, రిజిస్ట్రేషన్లను అడ్డుకుని పౌరులను బ్లాక్‌మెయిల్ చేయడం దారుణం. 3. గెజిట్ నోటిఫికేషన్లను తుంగలో తొక్కడం: చట్టం ప్రకారం సెక్షన్ 22-ఏ(1)(వ) కింద నిషేధం విధించాలంటే ప్రభుత్వం అధికారిక గెజిట్ నోటిఫికేషన్ ఇవ్వాలి. కానీ అధికారులు ఎలాంటి నోటిఫికేషన్ లేకుండా, కేవలం తహసీల్దార్ పంపిన లెటర్ హెడ్ ఆధారంగా రిజిస్ట్రేషన్లు నిలిపివేశారు. 4. న్యాయ తీర్పుల ధిక్కరణ: హైకోర్టు ఒక సర్వే నంబర్‌పై రిజిస్ట్రేషన్ చేయాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినా, తదుపరి డాక్యుమెంట్‌కు అదే అభ్యంతరాన్ని మళ్లీ లేవనెత్తి పౌరులను నిరంతరం కోర్టుల చుట్టూ తిప్పుతున్నారు. సెక్షన్ 22-ఏ శాసన పరిణామక్రమం ఈ దౌర్జన్యకరమైన చట్టం ఎలా ఉద్భవించిందో అర్థం చేసుకోవడానికి దాని శాసన న్యాయ చరిత్రను పరిశీలించాలి. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సీవీ నాగార్జున్‌రెడ్డి తీర్పులో అనేక ప్రధానమైన తీర్పులు ఉటంకిస్తూ, ఈ భయానకమైన కష్టాలను పేర్కొన్నారు. ప్రభుత్వం 1999లో ఆంధ్రప్రదేశ్ చట్టం 4/1999 ద్వారా రిజిస్ట్రేషన్ చట్టంలో సెక్షన్ 22-ఏను చేర్చింది.

# నిరంతర విద్యుత్తుకు అణు భరోసా



పంద్రాగస్టు సందర్భంగా ప్రధాని మోదీ ఎర్రకోట ప్రసంగంలో సెమీకండక్టర్ చిప్‌లు, అణు రియాక్టర్లు వంటి కీలక అంశాలను ప్రస్తావించారు. పైకి ఇవి వేర్వేరు రంగాల్లా కనిపించినా, వాటి మధ్య బలమైన లంకె ఉంది. చిప్ కర్మాగారాలకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా అవసరం. మరి, ఆ విద్యుత్తు ఎక్కడి నుంచి వస్తుందన్నదే ప్రశ్న. ఇటీవల కల్పాక్కంలోని ఫాస్ట్ బ్రీడర్ రియాక్టర్ క్రిటికాలిటీ సాధించడంతో, ఆరు దశాబ్దాల భారత అణు కార్యక్రమం రెండో దశలోకి అడుగుపెట్టింది. దీంతో ఇంధన భద్రతపై ఆశలు పెరుగుతున్నాయి. అణు విద్యుత్ కేంద్రం కూడా ఒక సాధారణ బొగ్గు(ఉష్ణ) విద్యుత్ కేంద్రంలాగే పనిచేస్తుంది. ఈ రెండింటి మధ్య ఉన్న ఒకే ఒక్క తేడా- నీటిని వేడి చేయడానికి వాడే ఇంధనమే. బొగ్గు కేంద్రంలో కోల్‌ను మండించి వేడిని పుట్టిస్తే, అణు రియాక్టర్‌లో అణువిచ్ఛిత్తి ద్వారా వేడిని తయారు చేస్తారు. ఆ వేడితో నీటిని మరిగించి ఆవిరిగా మార్చి, ఆ ఆవిరి ఒత్తిడితో టర్బైన్‌ను వేగంగా తిప్పుతారు. తద్వారా టర్బైన్‌కు అనుసంధానించిన జనరేటర్ ద్వారా విద్యుత్తు ఉత్పత్తి అవుతుంది. కేవలం ఒక కిలో యురేనియం నుంచి వచ్చే శక్తి, కిలో బొగ్గు కంటే దాదాపు పదిలక్షల రెట్లు ఎక్కువగా ఉంటుంది. దీనివల్ల పర్యావరణానికి హాని చేసే కర్బన ఉద్గారాలు కూడా తక్కువే వెలువడతాయి. కాలుష్య రహితమైన అపార శక్తిని అందిస్తుండటంతో ప్రపంచవ్యాప్తంగా అణు విద్యుత్తుకు ప్రాధాన్యం పెరుగుతోంది.

## కీలక మైలురాయి

దేశంలో ప్రస్తుతం 24 అణు రియాక్టర్లుండగా, మొత్తం 8,780 మెగావాట్ల సామర్థ్యం ఉంది. 2024-25లో అవి దాదాపు 5,700 కోట్ల యూనిట్ల విద్యుత్తును ఉత్పత్తి చేశాయి. అయినా దేశ విద్యుత్ ఉత్పత్తిలో అణు వాటా సుమారు మూడు శాతమే. బొగ్గు వాటా 70 శాతానికి దగ్గరగా ఉంది. 2031-32 నాటికి అణు విద్యుత్ సామర్థ్యాన్ని 22,480 మెగావాట్లకు, 2047 నాటికి 100 గిగావాట్లకు పెంచాలన్నది లక్ష్యం. భారత అణు పితామహుడిగా పేరొందిన హోమీ భాభా మన దేశంలోని వనరుల పరిమితిని దృష్టిలో పెట్టుకుని అణు కార్యక్రమాన్ని రూపొందించారు. మనకు యురేనియం నిల్వలు తక్కువ. థోరియం సమృద్ధిగా ఉంది. కానీ థోరియాన్ని నేరుగా ఇంధనంగా వాడలేం. మొదటి దశలో సహజ యురేనియంతో భారజల రియాక్టర్లు నడుస్తాయి. ఈ ప్రక్రియ ద్వారా తయారయ్యే ప్లుటోనియం-239ను రెండో దశలో ఫాస్ట్‌బ్రీడర్ రియాక్టర్లలో ఇంధనంగా వాడతారు. ఈ రియాక్టర్లలోని యురేనియం-238 న్యూట్రాన్లను గ్రహించి కొత్త ప్లుటోనియం-239గా మారుతుంది. మూడో దశలో థోరియం-232 న్యూట్రాన్లను గ్రహించి, వరస అణు పరివర్తనల ద్వారా యురేనియం-233గా మారుతుంది. అప్పుడు దీన్ని ఇంధనంగా ఉపయోగించవచ్చు. అందుకే రెండోదశ విజయం మూడోదశకు కీలకం. మొన్న ఏప్రిల్ 6న కల్పాక్కంలోని 500 మెగావాట్ల ప్రోటోటైప్ ఫాస్ట్ బ్రీడర్ రియాక్టర్ తొలిసారి క్రిటికాలిటీ సాధించింది. అంటే బయటి నుంచి న్యూట్రాన్లను అందించాల్సిన అవసరం లేకుండా, గొలుసు చర్య తనంతట తానే స్థిరంగా కొనసాగే స్థితికి రియాక్టర్ చేరుకుంది. అయితే, ఈ రియాక్టర్ నిర్మాణం 2004లో మొదలై, తొలి క్రిటికాలిటీకి 22 ఏళ్లు పట్టింది. కొత్త లక్ష్యాలు సాధించాలంటే వేగం పెరగాల్సిన అవసరాన్ని ఇది చెబుతోంది. థోరియం మన నేలలో ఉన్నా, దాన్ని ఇంధనంగా మార్చేందుకు రెండో దశ రియాక్టర్లు ముందుగా పనిచేయాలి. అందుకే కల్పాక్కం రియాక్టర్ క్రిటికాలిటీ ఒక మైలురాయి. నిరుడు పార్లమెంటు 'శాంతి' చట్టాన్ని ఆమోదించింది. లైసెన్సు పొందిన ప్రైవేటు సంస్థలకు అణు విద్యుత్ కేంద్రాల నిర్మాణం, నిర్వహణకు మార్గం తెరిచింది. యురేనియం శుద్ధి, ఇంధన పునఃశుద్ధి ప్రభుత్వ అధీనంలోనే ఉంటాయి. నష్టపరిహార వ్యవస్థలోనూ మార్పులు చేసి, సరఫరాదారుల బాధ్యతను తొలగించి నిర్వాహక సంస్థ బాధ్యతకు పరిమితి విధించారు. దీంతో దేశీయ ప్రైవేట్ పెట్టుబడులకు, విదేశీ సంస్థల నుంచి సాంకేతికత, పరికరాల సరఫరాకు మార్గం సుగమమైంది. భవిష్యత్ సామర్థ్యంలో చిన్న రియాక్టర్ల పాత్ర కీలకం కావడంతో భాభా అణు పరిశోధన కేంద్రం 200 మెగావాట్ల భారత్ స్మాల్ మాడ్యులర్ రియాక్టర్, 55 మెగావాట్ల చిన్న రియాక్టర్, హైడ్రోజన్ ఉత్పత్తికి 5 మెగావాట్ల థర్మల్ గ్యాస్ రియాక్టర్‌ను రూపొందిస్తోంది. చిన్న రియాక్టర్లను కర్మాగారంలో తయారు చేసి, అవసరమైన చోటుకు తరలించవచ్చు. మూతపడుతున్న బొగ్గు కేంద్రాల స్థలాల్లో వీటిని ఏర్పాటుచేస్తే, ఇప్పటికే ఉన్న గ్రిడ్ సదుపాయాన్ని కూడా వాడుకోవచ్చు.

## పెరుగుతున్న అవసరం

రానున్న కాలంలో విద్యుత్ అవసరం భారీగా పెరగనుంది. వాతావరణ లక్ష్యాల దృష్ట్యా బొగ్గుపై ఆధారపడలేం. సౌర, పవన విద్యుత్తు నిరంతరం అందుబాటులో ఉండవు. భారీ నిల్వ వ్యవస్థ కూడా సిద్ధంగా లేదు. అందుకని నిరంతరాయంగా విద్యుత్తును అందించే అణుశక్తి మన ఇంధన వ్యవస్థలో కీలక భాగం కావాలి. భాభా 1950లలో ఈ దారిని ఎంచుకున్నప్పుడు పరిశ్రమలు తక్కువ, వనరులు పరిమితం. యురేనియం తక్కువగా, థోరియం సమృద్ధిగా ఉన్న దేశానికి ఇది సుదీర్ఘ ప్రయాణమని ఆయనకు తెలుసు. అందుకని, మూడు దశల మార్గాన్ని రూపొందించారు. ఇన్నేళ్లకు రెండో దశకు చేరుకున్నాం. ఇక మూడో దశను సాకారం చేయాల్సిన సమయం వచ్చింది. రియాక్టర్ల ఏర్పాటుకు భూసేకరణ, అనుమతులు, ఇంధన సరఫరాతో పాటు వేలమంది ఇంజినీర్లు, రేడియేషన్ భద్రతా నిపుణులు, నియంత్రణ అధికారులను సిద్ధం చేసుకోవాలి. రియాక్టర్లను సకాలంలో నిర్మించి, నిపుణులను సిద్ధం చేయగలిగితే, ప్రణాళికలను కార్యాచరణ రూపంలోకి తేగలిగితే 2047 నాటికి అణు భారతం కేవలం లక్ష్యం కాదు- సాధించగలిగే వాస్తవమవుతుంది. ఈ ప్రయాణాన్ని వేగంగా ముందుకు తీసుకెళ్లడమే ముందున్న కర్తవ్యం.

# ఆకాశంలో సాగిన కార్గిల్ పోరాటం.. భారత వైమానిక దళం వీరగాథ

1999 కార్గిల్ యుద్ధం అనగానే భారత సైన్యం నిర్వహించిన'ఆపరేషన్ విజయ్' ముందుగా మన జ్ఞాపకాల్లో మెదులుతుంది. అయితే ఆ విజయానికి ఆకాశం నుంచి అండగా నిలిచిన భారత వైమానిక దళం నిర్వహించిన కథ మాత్రం అంతగా ప్రచారంలోకి రాలేదు.. ఈ నేపథ్యంలో నెట్‌ఫ్లిక్స్ రూపొందించిన 'ఆపరేషన్ సఫేద్ సాగర్' సిరీస్ ఒక మరుగునపడిన యుద్ధ అధ్యాయాన్ని తెరమీదకు తీసుకొచ్చింది. ఆ యుద్ధంలో భారత వైమానిక దళం పోషించిన కీలక పాత్రను తెరకెక్కిస్తూ నెట్‌ఫ్లిక్స్ రూపొందించిన సిరీస్ 'ఆపరేషన్ సఫేద్ సాగర్ ది అన్‌టోల్డ్ స్టోరీ ఆఫ్ ది కార్గిల్ వార్'. 1999లో పాకిస్తాన్ బలగాలు భారత భూభాగంలోకి చొరబడటంతో మొదలైన కార్గిల్ యుద్ధంలో, ఆక్రమిత ప్రాంతాలను తిరిగి స్వాధీనం చేసుకునేందుకు భారత వైమానిక దళం చేపట్టిన వ్యూహాత్మక వైమానిక దాడులే ఈ సిరీస్‌కు కేంద్ర బిందువు.. యుద్ధం ముదిరే కొద్దీ, గోల్డెన్ ఆరోస్ స్క్వాడ్రన్ శత్రు భూభాగం లోతట్టు ప్రాంతాల్లోకి ప్రమాదకరమైన మిషన్ కోసం బయలుదేరుతుంది.

## యుద్ధంలో జీవన్మరణ నిర్ణయాలు..

కథలో కీలకమైన స్క్వాడ్రన్ లీడర్ అజయ్ ఆహూజా పాత్రను బహుభాషా నటుడు సిద్ధార్థ్ పోషించారు. వార్షిక యుద్ధ విన్యాసానికి ముందు గోల్డెన్ ఆరోస్ స్క్వాడ్రన్‌కు శిక్షణ ఇవ్వడానికి పిలిపించిన అధికారిగా ఆయన పాత్ర సాగుతుంది. తనతో పాటు ఫ్లయింగ్ ఆఫీసర్ ఆర్ఎస్ దలివాల్‌గా అభయ్ వర్మ, బాల్ రెడ్డిగా మిహిర్ ఆహూజా, జితేంద్ర సంగ్వాన్‌గా తారుక్ రైనా, అమిత్ గుప్తాగా అర్నవ్ భాసిన్ నటించిన యువ అధికారుల బృందం, ప్రాణాంతక పరిస్థితుల మధ్య, జీవన్మరణ నిర్ణయాలు తీసుకుంటూ యుద్ధంలో నిమగ్నమవుతారు.

## సతీమణుల భావోద్వేగ ప్రయాణం..!

జిమ్మీ షెర్గిల్, అదిల్ హుస్సేన్ సీనియర్ వైమానిక దళ అధికారుల పాత్రల్లో కనిపిస్తారు. హుస్సేన్ పోషించిన పాత్ర వాస్తవ జీవితంలో కార్గిల్ యుద్ధ సారథ్యం వహించిన ఎయిర్ మార్షల్ వినోద్ పాత్నే ఆధారంగా రూపొందింది. కీలక మిషన్లను ఆమోదించడం, తిరస్కరించడం వంటి కఠిన నిర్ణయాలు తీసుకునే బాధ్యతాయుత అధికారిగా ఈ పాత్ర సాగుతుంది. యుద్ధభూమికి అవతల, సైనికుల వెనుక నిలబడే వైమానిక దళ సతీమణుల భావోద్వేగ ప్రయాణాన్ని దియా మీర్జా, ప్రాజక్తా కోలి వంటి నటులు ఆవిష్కరిస్తారు. వీరికి తోడు భారత్ వైపు వాజపేయి, జార్జ్ ఫెర్నాండెజ్, ఎల్. కె. అద్వానీ, పాకిస్థాన్ వైపు నవాజ్ షరీఫ్, జనరల్ పర్వేజ్ ముషారఫ్‌ల పాత్రల్ని కూడా జోడించారు..

దేశభక్తి.. నినాదం కంటే గొప్ప అనుభవం!




యుద్ధ దృశ్యాలతో పాటు, రాజకీయ ఒత్తిడి కమాండ్ వ్యవస్థను ఎలా ప్రభావితం చేస్తుందో చూపిస్తూ, ధైర్యం, విధేయత, యుద్ధం మిగిల్చే మానసిక వేదనను ఈ సిరీస్ చిత్రీకరిస్తుంది. కార్గిల్ యుద్ధం సాధారణ యుద్ధం కాదు. వేల అడుగుల ఎత్తులోని మంచుకొండలపై శత్రు స్థావరాలను గుర్తించడం, సాంద్రత తక్కువవున్న పలుచని గాలిలో విమానాలను నియంత్రించడం, ప్రతికూల వాతావరణంలో లక్ష్యా లను ఛేదించడం ప్రతి క్షణమూ పైలట్లకు ఒక పరీక్ష. అందుకే 'సఫేద్ సాగర్' చూస్తే అది కేవలం విమానాలు, బాంబులు, పేలుళ్ల కథ అనిపించదు.. పర్వాతాల ఎత్తు, మంచు, సమయం, సాంకేతిక పరిమితులు, మానవ ధైర్యం మధ్య జరిగిన పోరాటం. 1999లో మిరాజ్-2000 విమానాల ద్వారా లేజర్-గైడెడ్ బాంబుల వినియోగం భారత వైమానిక దళానికి ఒక కీలకమైన వ్యూహాత్మక మలుపు. అత్యంత ఎత్తులోని లక్ష్యాలను ఖచ్చితంగా ఛేదించగల సామర్థ్యం యుద్ధ గమనంలో ముఖ్యమైన మార్పును తీసుకొచ్చింది. యుద్ధంపై రూపొందిన చిత్రాలకు దేశభక్తి సహజమైన అంశం. వీరత్వం అంటే భయం లేకపోవడం కాదు.. భయం ఉన్నప్పటికీ బాధ్యతను నిర్వర్తించడం. ఈ సిరీస్ చెప్పే దేశభక్తి నినాదం కంటే గొప్ప అనుభవంగా మిగులుతుంది.

## విజువల్ స్పెక్టికల్‌కి టచ్ తోడైంది!

నిజమైన సైనిక వాతావరణం, వైమానిక దళ స్థావరాలు, విమానాలు, మాజీ అధికారుల సలహాలు వంటి అంశాలు సిరీస్‌కు వాస్తవికతను అందిస్తాయి. అదే సమయంలో ప్రేక్షకుడిని కట్టిపడేయడానికి కొన్ని సంఘటనలను నాటకీయంగా మలచడం కూడా కనిపిస్తుంది. 'సఫేద్ సాగర్' మొత్తంగా యుద్ధాన్ని కేవలం ఒక విజువల్ స్పెక్టకిల్‌గా మాత్రమే మార్చ కుండా టచింగ్‌గా ఉండగలిగింది. సిద్ధార్థ్ అజయ్ అహూజా పాత్రకు ఒక అంతర్గత ప్రశాంతతను తీసుకొచ్చాడు. అతని నటనలో నాయకత్వం కంటే ముందు స్నేహితుడయిన మనిషి కనిపిస్తాడు. జిమ్మీ షెర్గిల్ ధనోవాగా ఖచ్చితమయిన నాయకత్వాన్ని ప్రతిబింబించాడు. తన కింద పనిచేసే యువ పైలట్లను కేవలం సైనికులుగా కాకుండా బాధ్యతగా మోసే కమాండర్ అతని పాత్ర. అభయ్ వర్మతో పాటు యువ నటులు స్క్వాడ్రన్‌కు యవ్వన శక్తిని అందించారు.. వారి మధ్య స్నేహం, పోటీ, భయం, ఉత్సాహం కలిసి యుద్ధ యంత్రాంగం వెనుక ఉన్న మానవ బృందాన్ని మనకు పరిచయం చేస్తాయి.

## ఆకాశంలో విమానం.. నేలమీద ఓ కుటుంబం

యుద్ధ విమానం ఒక యంత్రమే కాని దాన్ని నడిపించే పైలెట్ వెనుక ఒక కుటుంబం ఉంటుంది. భయం ఉంటుంది. సందేహం ఉంటుంది. ప్రేమ ఉంటుంది. బాధ్యత ఉంటుంది. తిరిగి వస్తానో రానో తెలియని అనిశ్చితి ఉంటుంది. అందుకే ఆకాశంలోకి ఎగిరే ప్రతి యుద్ధ విమానం వెనుక నేలమీద ఒక కుటుంబం గుండెల్లో మొదలయ్యే నిరీక్షణ ఉంటుంది. అజయ్ అహూజాఅల్కా అహూజా సంబంధం ఈ మానవ కోణానికి ఒక నిశ్శబ్దమైన భావోద్వేగ స్థితిని జోడిస్తుంది. యుద్ధరంగంలో లేని కుటుంబాలు కూడా యుద్ధాన్ని ఎలా అనుభవిస్తాయో ఈ సన్నివేశాలు గుర్తుచేస్తాయి..